www.vaarthavedhikasurya.com

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

తెలంగాణ | పేజీలు: 08 | వెల: 5 | సంపుటి:01 | సంచిక: 108 | శుక్రవారం | 14, ఫిబ్రవరి 2025 | ॥ ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి ॥

## వక్ఫ్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

**నిరసనల మధ్యే ప్రవేశ పెట్టిన ప్రభుత్వం ● గందరగోళం మధ్య సభ వాయిదా**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి13(వార్త వేదిక సూర్య): 'వక్ఫ్ సవరణ బిల్లు-2024'పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) రూపొందించిన నివేదికను కేంద్ర ప్రభుత్వం గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. జేపీసీకి చైర్మన్‌గా వ్యవహరించిన జగదంబికా పాల్, బిజెపి ఎంపీ సంజరు తదితరులు ఈ ముసాయిదా బిల్లుపై తమ నివేదికను హిందీ, ఇంగ్లీష్ భాషల్లో సభ ముందుకు తీసుకొచ్చారు. ఈ బిల్లుపై నివేదికను రాజ్యసభ ఎంపీ మేధా కులకర్ణి సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సభలో గందరగోళం నెలకొంది. నివేదికపై ప్రతిపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. తాము సమర్పించిన డిస్సెంట్ (అసమ్మతి) నోట్‌ను తొలగించారంటూ నిరసనకు దిగారు. సభలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభను చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ 20 నిమిషాల పాటు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభమైనప్పటికీ ప్రతిపక్షాలు తమ నిరసనను కొనసాగించాయి. ఈ నిరసనల మధ్యే ఈ నివేదికకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. కాగా, జనవరి 29న ముసాయిదా నివేదికను జెపిసి ఆమోదించిన విషయం తెలిసిందే.




## బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం అబద్ధం

- విభజన నాటికి మిగులు బడ్జెట్‌లో తెలంగాణ
- కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, పసుపు బోర్డు ఇచ్చింది మేమే
- ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఎదురుదాడి




న్యూఢిల్లీ,ఫిబ్రవరి13(వార్త వేదిక సూర్య): బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ కొట్టి పారేశారు. విభజన నాటికి మిగులు బడ్జెట్ ఉన్న

మిగతా 2లో..

## ఫిబ్రవరి 19న బిఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం

**- బిఆర్ఎస్ పార్టీ అధినేత కె.చంద్రశేఖర్ రావు**



హైదరాబాద్,ఫిబ్రవరి13(వార్త వేదిక సూర్య): ఈనెల 19 వ తేదీన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రకార్యవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని బిఆర్ఎస్ పార్టీ అధినేత కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కె.టి. రామారావును ఆదేశించారు. అధినేత ఆదేశాలమేరకు...ఈనెల 19 వ తేదీన మధ్యాహ్నం 1 గంటనుండి హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరగనున్నది. అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రస్తుత మరియు మాజీ... ఎంపీలు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, కార్పోరేషన్ చైర్మన్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, డిసిసిబి, డిసిఎంఎస్ అధ్యక్షులు పార్టీ నియోజకవర్గ ఇంచార్జీలతో కూడిన విస్తృతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నామని పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ తెలియజేశారు.

ఈ నెల 19న నిర్వహించే ప్రత్యేక సమావేశంలో, బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏండ్లు కావస్తున్న నేపథ్యంలో పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకల నిర్వహణతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు, పార్టీ నిర్మాణం తదితర నిర్మాణాత్మక అంశాలపై విస్తృతస్థాయిలో చర్చించనున్నామని కెటిఆర్ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు,

మిగతా 2లో..





## గూగుల్‌తో ఒప్పందం కీలకం




- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- గూగుల్‌తో ప్రభుత్వ అవగాహన ఒప్పందం

హైదరాబాద్,ఫిబ్రవరి13(వార్త వేదిక సూర్య): రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యాన్ని ఉపయోగించుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ తో ఒప్పందం చేసుకుంది.

ప్రధానంగా వ్యవసాయం, సుస్థిరాభివృద్ధి, పరిపాలన, రవాణా, విద్య తదితర కీలక రంగాల్లో ఏఐ ఆధారిత సేవలు, పరిష్కారాలు అమలు చేయాలని లక్ష్యంగా ఎంచుకుంది.

మిగతా 2లో..

## కుల గణన సర్వేలో పాల్గొనని వారికి ఈనెల 16 - 28 మధ్య మరో అవకాశం

- 42 శాతం రిజర్వేషన్లకు ఎన్నికల్లో ,విద్యా ,ఉపాధి అవకాశాల్లో చట్టబద్దత కల్పిస్తాం
- కులాల వారిగా ఎక్కడ లెక్కలు బయటకి ఇవ్వలేదు
- బయట వస్తున్న కులాల వారి లెక్కలు పూర్తిగా తప్పు
- బీసీ సంఘాల నేతల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,ఫిబ్రవరి13(వార్త వేదిక సూర్య): తెలంగాణ ప్రభుత్వం కుల సర్వేలో పాల్గొనని వారికి మరో అవకాశం ఇస్తూ ఈనెల 16 నుండి 28 వరకు అవకాశం ఇవ్వడం పట్ల బీసీ సంఘాల నేతలు ,మేధావులు ప్రొఫెసర్లు హర్షం వ్యక్తం చేశారు. సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తో బీసీ సంఘాల నేతలు సమావేశమయ్యారు. సమావేశంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ , బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు. ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయడంలో భాగంగా బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో ,విద్యా ఉపాధి అవకాశాల్లో చట్టబద్దత కల్పిస్తామని నిర్ణయం తీసుకోవడం పట్ల బీసీ సంఘాల నేతలు ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ లకు ధన్యవాదాలు తెలిపారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, సమగ్ర ఇంటింటి కుల సర్వే లో పాల్గొనని వారికి మరో అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అంతే కాకుండా తమ నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల ఎన్నికలు,విద్యా ఉపాధి అవకాశాల్లో చట్ట బద్దత చేస్తామని మార్చ్ మొదటి వారంలో కేబినెట్ సమావేశం ఏర్పాటు చేసి తరువాత వెంటనే శాసన సభ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్దత బిల్లు పెడతామని తెలిపారు.

మిగతా 2లో..

## మేమూ 'పింక్' బుక్ రాస్తున్నాం!

- పింక్ బుక్ మెయింటైన్ చేస్తున్నాం.. ఇంతకింత చెల్లిస్తాం
- లెక్కలు ఎలా రాయాలో మాకు తెలుసు... మీ లెక్కలు తీస్తాం
- మేం అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి చెల్లిస్తాం
- బీసీ రిజర్వేషన్ పెంపు ఆచరణ సాధ్యంకావాలి
- జనగామ జిల్లాలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలు



జనగామ,ఫిబ్రవరి13(వార్త వేదిక సూర్య): అక్రమ కేసులతో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ ప్రభుత్వం వేధిస్తుండడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు. "మేము పింక్ బుక్ మెయింటైన్ చేస్తున్నాం. అందులో అన్నీ రాసుకుంటాం. ఇంతకింత తిరిగి చెల్లిస్తాం. లెక్కలు ఎలా రాయాలో మాకు తెలుసు. మీ లెక్కలన్నీ తీస్తాం. అన్నింటినీ మేం అధికారంలోకి వచ్చాక తిరిగి చెల్లిస్తాం" అని కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా హెచ్చరించారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, కాంగ్రెస్ వేధింపులకు గులాబీ సైనికులు భయపడబోరని తేల్చిచెప్పారు.గురువారం జనగామ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ డిప్యూటీ సీఎం టీ రాజయ్యతో కలిసి ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. అంతకుముందు పెంబర్తిలోనూ

మిగతా 2లో..

## గురుకులాల్లో ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెట్టండి




- ఉద్యోగ కల్పన కేంద్రాలుగా స్టడీ సెంటర్లో ఉండాలి
- బీసీ సంక్షేమ, రవాణా శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,ఫిబ్రవరి13(వార్త వేదిక సూర్య): అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టల్ల, గురుకులాల అద్దె బకాయిలు వీడు వెంటనే చెల్లిస్తాం, ప్రతిపాదనలు తీసుకురావాలని

మిగతా 2లో..



## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన

**కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి13(వార్త వేదిక సూర్య): బీజేపీ పాలిత రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. సీఎం బీరేన్ సింగ్ రాజీనామా చెయ్యడంతో రాష్ట్రపతి పాలన దిశగా కేంద్రం నిర్ణయం తీసుకుంది. మైతేయి, కుకీ తెగల మధ్య జరుగుతున్న ఘర్షణల కారణంగా మణిపూర్ అట్టుడు కుతోంది. ఈ క్రమంలో సీఎం రాజీనామా చేశారు. మణిపూర్ అల్లర్ల సందర్భంగా సీఎం బీరేన్ సింగ్ ఒక వర్గానికి కొమ్ము కాస్తున్నారని, ఒక వర్గాన్ని కావాలనే రెచ్చగొట్టి అల్లర్లకు మద్దతు ఇచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో సొంత పార్టీ నేతలే ఆయనపై విమర్శలకు దిగారు. అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తే విశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉండటం.. సొంత పార్టీ నేతలు విప్ ధిక్కరించి వ్యతిరేకంగా ఓటు వేసే పరిస్థితులు ఉన్నందున.. పార్టీ అధిష్టానం సీఎం బీరేన్ సింగ్ తో రాజీనామా చేయించింది. మణిపూర్ లో మే 2023 నుంచి అల్లర్లు జరుగుతున్నాయి.



## రేవంత్ సోదరుడు కొండల్ రెడ్డి జేబులోకి ఇసుక ఆదాయం

- కొండల్ రెడ్డి ఇసుకమాఫియాతో ద రాష్ట్ర ఖజానా కు నష్టం
- ఎనిమిది వందల కోట్ల రూపాయల టార్గెట్ కోసం నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు
- కొన్ని ప్రాజెక్టుల దగ్గర నీళ్లు ఖాళీ చేసి మరీ ఇసుక తరలిస్తున్నారు
- రేవంత్ వచ్చినప్పటినుంచి జరిగిన ఇసుక అమ్మకాలన్నీ బయట పెట్టాలి
- రేవంత్ రెడ్డి ఇసుక అక్రమ దందాలపై మరిన్ని వివరాలు త్వరలోనే బయట పెడతాం
- బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ సంచలన ఆరోపణలు

హైదరాబాద్,ఫిబ్రవరి13(వార్త వేదిక సూర్య): తెలంగాణ ఇసుక దందా మొత్తం సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి కనుసన్నల్లో నడుస్తోందని బీఆర్ఎస్ ఆరోపించింది. కొండల్‌రెడ్డి

మిగతా 2లో..

## పార్లమెంట్ ముందుకు కొత్త ఐటి చట్టం

- నిరసలన మధ్యే ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్
- విపక్షాల వాకౌట్... లోక్‌సభ మార్చి 10కి వాయిదా


న్యూఢిల్లీ,ఫిబ్రవరి13(వార్త వేదిక సూర్య): ప్రస్తుతం అమలులో ఉన్న దశాబ్దాల నాటి ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకురానుంది. దీనిలో భాగంగా ఆదాయపు పన్ను (ఐటీ) నూతన బిల్లు పార్ల మెంటు ముందుకు వచ్చింది. విపక్షాల నిరసనల మధ్యే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో ప్రకటించిన మేరకు బిల్లును తీసుకుని వచ్చారు. అయితే విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. బిల్లుకు నిరసనగా వాకౌట్ చేయడం గమనార్హం. అనంతరం కాసేపటికే లోక్‌సభ మార్చి 10కి వాయిదా పడింది. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి, ఎన్నో సవరణలు జరిగాయి. దీంతో సంక్లిష్టంగా తయారైంది. పన్ను చెల్లింపుదార్లకు వ్యయాలూ పెరిగాయి. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు ఇప్పుడు బిల్లును రూపొందించారు.

## మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం

- బీసీ జాబితాలో ముస్లింలను చేర్చిస్తే ఆమోదించే ప్రసక్తే లేదు
- బీసీలను నిండా ముంచుతున్న పార్టీ కాంగ్రెస్సే.
- మీరు ఆమోదించిన రాజ్యాంగాన్ని మీరే అవమానిస్తారా?
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్,ఫిబ్రవరి13(వార్త వేదిక సూర్య): మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం బీసీ జాబితాలో ముస్లింలను చేర్చిస్తే ఆమోదించే ప్రసక్తే లేదు. ఈ విషయం తెలిసి కూడా కేంద్రంపై నెట్టాలనుకోవడం మూర?త్వం. బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలనే చిత్తశుద్ది కాంగ్రెస్ కు లేదని తేటతెల్లమైంది.

బీసీల్లో ముస్లింలను చేర్చడంవల్ల, బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్లు దక్కకుండా పోతాయి. కాంగ్రెస్ పార్టీ బీసీలకు మరింత అన్యాయం చేస్తోంది. ముస్లింలను బీసీల్లో కలిపితే హిందూ సమాజమంతా తిరగబడటం ఖాయం. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పడం తథ్యం. కాంగ్రెస్ కు చిత్తశుద్ది ఉంటే బీసీ జాబితాలో నుండి ముస్లింలను తొలగించాల్సిందే. ఎన్నికల హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సిందే. ఇచ్చిన మాట తప్పుతూ బీసీలను నిండా ముంచుతున్న పార్టీ కాంగ్రెస్సే.. బీసీలంతా కాంగ్రెస్ మోసాలను గుర్తించాలని కోరుతున్నా. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే దమ్ము కాంగ్రెస్ కు లేదు. మార్చిలోపు స్థానిక ఎన్నికలు నిర్వహించకపోతే తెలంగాణకు నష్టమని తెలీదా? 15వ గ్రాంట్స్ కమిషన్ నిధులు ఆగిపోతాయని తెలిసి కూడా జాప్యం చేస్తారా? ఇప్పటికే రెండు దఫాలుగా నిధులు రాలేదు. 73, 74వ రాజ్యాంగ సవరణలను ఉల్లంఘిస్తున్నారు. స్థానిక సంస్థలకు ఐదేళ్లకోసారి తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాలని రాజ్యాంగం చెబుతోంది. మీరు ఆమోదించిన



రాజ్యాంగాన్ని మీరే అవమానిస్తారా? రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరగడం కాదు. రాజ్యాంగాన్ని అమలయ్యేలా చూడాలి. సర్పంచ్ లేకుంటే గ్రామ సభలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు జరిగేదెలా? గ్రామాల్లో పూర్తిగా అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడుతున్నా పట్టించుకోరా? ఓడిపోతామనే భయానికే స్థానిక ఎన్నికలు నిర్వహించడం లేదు....

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY



# షబ్ ఈ భరత్ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలి

**బీజేఎంసీ కమిషనర్‌ను కోరిన ఏసీఎఫ్ ఆఫ్ బీజేఎంసీ**

గండిపేట్, (వార్త వేదిక సూర్య): బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో షబ్ ఈ భరత్ కార్యక్రమానికి ఏర్పాట్లను సిద్ధం చేయాలని కార్పొరేషన్ కమీషనర్ శరత్ చంద్రను ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ఆఫ్ బీజేఎంసీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని కమిషనర్ శరత్ చంద్రకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేఎంసీలో ఉన్న మసీదుల వద్ద ఫాగింగ్, వీధి దీపాలు మరమ్మతు చేయాలని కోరారు. అభ్యుదయ నగర్ కాలనీ నుంచి కాళీ మందిరం ప్రాంతంలో కూడా వీధి దీపాల మరమత్తులు చేయాలని కోరారు. కమిషనర్ ఖచ్చితంగా పనులు చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ఆఫ్ బీజెయంసీ ఉపాధ్యక్షులు నదీమ్, ప్రధాన కార్యదర్శి నరేందర్ బాబు, ఖుత్బుద్దీన్ పాల్గొన్నారు.

# గూగుల్‌తో ఒప్పందం కీలకం

మొదటి పేజీ తరువాయి..

భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా డిజిటల్ నైపుణ్యాలతో శ్రామిక శక్తిని సన్నద్ధం చేసేందుకు వ్యూహాత్మక సహకారం అందించనుంది.

టీ హబ్లో గురువారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు గూగుల్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం గూగుల్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం రైతులకు వ్యవసాయ సంబంధిత ఏఐ ఆధారిత పరిష్కారాలు అందించనుంది. రవాణా సదుపాయాలను మెరుగుపరిచే డేటా ఇంటిగ్రేషన్ సదుపాయాల కల్పనలోనూ భాగస్వామ్యం పంచు కుంటుంది. గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్ ద్వారా ఏఐ నైపు ణ్యాలు పెంపొందించే కార్యక్రమాలపై దృష్టి సారిస్తుంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో డిజిటల్ అభ్యసన పద్ధతులను ప్రారంభిస్తుంది. గూగుల్ వర్క్ స్పేస్, క్రోమ్ సర్వీసెస్ ను అందిస్తుంది. రైతులకు అవసరమైన ఇన్పుట్, రెడిట్, మార్కెటింగ్ సదుపాయాలన్నీ అనుసంధానం చేస్తూ తెలంగాణ ఓపెన్ అగ్రికల్చర్ నెట్‌వర్క్ ను ప్రారంభిస్తుంది. గూగుల్ డేటా కామన్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఓపెన్ డేటా యాక్సెస్‌ను మెరుగుపరుస్తుంది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ "ఏఐ ఆధారిత తెలంగాణ దార్శనికతకు గూగుల్ సహకారం ఎంతగానే ఉప యోగపడుతుంది. అత్యాధునిక ఏఐ టెక్నాలజీ ద్వారా కీలక రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని లక్ష్యంగా ఎంచుకున్నాం. మెరుగైన పాలన, ఆర్థిక పురోగతితో పాటు ప్రజా సేవలను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని అనుకున్నాం. ఈ లక్ష్య సాధనలో గూగుల్ తో ఒప్పందం కీలకంగా నిలుస్తుంది..' అన్నారు. గూడుల్ ఇండియా కంట్రీ మేనేజర్ ప్రీతి లోబానా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ కీలక రంగాలలో సహకారం అందించటం సంతోషంగా ఉందన్నారు. దేశ డిజిటల్ భవిష్యత్తు పట్ల తమ సంస్థ నిబద్ధతను ఈ నిర్ణయం బలోపేతం చేస్తుందని అన్నారు. ఏఐ ఆధారిత వర్క్ ఫోర్స్ ను పెంపొందించటం, స్టార్టప్ లను ప్రోత్సహించడం, వ్యవసాయం, విద్య లాంటి కీలక రంగాల్లో పని చేయటం ఉత్సాహంగా ఉందని అన్నారు.

# కుల గణన సర్వేలో పాల్గొనని వారికి ఈనెల 16 - 28 మధ్య మరో అవకాశం

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కేబినెట్ మంత్రుల బృందం ఢిల్లీ వెళ్లి అన్ని పార్టీలను కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి దీనికి మద్దతు ఇవ్వాలని కోరుతామని పేర్కొన్నారు. బీసీ సంఘాల నేతలు , ప్రొఫెసర్లు , మేధావులు జిల్లాల పర్యటన చేసి కుల సర్వేలో పాల్గొనని వారు పాల్గొనేలా కృషి చేయాలని సూచించారు. ప్రస్తుతం కులాల వారిగా బయటకు వస్తున్న లెక్కలు పూర్తిగా తప్పు అని దీనిని కావాలని ప్రతిపక్షాలు తప్పుడు లెక్కలు ప్రచారం చేస్తున్నాయని బీసీ సంఘాల నేతలతో మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కుల సర్వే లో పాల్గొనని వారి కోసం ఈనెల 16 లోపు ఒక టోల్ ఫ్రీ నెంబర్ వస్తుందని దానికి సమాచారం ఇస్తే ఎన్యూమరేటర్ సమాచారాన్ని సేకరిస్తారని తెలిపారు. దాంతో పాటు ఎంపీడీఓ కార్యాలయాల్లో కుల సర్వే సమాచార సేకరణకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడంతో పాటు ఆన్లైన్ లో కూడా సమాచారాన్ని సేకరించేలా చూస్తున్నారన్నారు.పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందనీ తెలిపారు. బీసీ కుల గణన కోసం అన్ని పార్టీలు కలిసి రావాలని బీసీ కులగణన పై అసెంబ్లీ లో బిల్లుపెట్టడం తో పాటు చట్ట బద్దత కోసం కేంద్రం పెద్దలను కలిసి చర్చిస్తామన్నారు.తెలంగాణ అభివృద్ధి , సంక్షేమం కోసం తమినాడు తరహాలో తెలంగాణలోనూ రాజకీయ పార్టీలు ఏకం కావాలన్నారు.బిఆర్ఎస్ పార్టీకి బీసీల పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రాహుల్ గాంధీ గారు తీసుకున్న బృహత్తర కార్యక్రమం బీసీ కులగణన అని రాహుల్ గాంధీ కోరిక మేరకు కులగణన సర్వేను చేపట్టి పూర్తి చేశా మన్నారు. సమావేశంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, బీసీ సంఘాల నేతలు ఆర్ కృష్ణయ్య , జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, మాజీ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్, జాజుల శ్రీనివాస్ గౌడ్, కార్పొరేషన్ చైర్మన్లు నూతి శ్రీకాంత్ గౌడ్, ఈరవత్రి అనిల్, మాజీ ఐఏఎస్ చిరంజీవులు, వినయ్ కుమార్ ,తాడురి శ్రీనివాస్ ,దాసు సురేష్, కుమార స్వామి, ప్రొఫెసర్లు మురళి మనోహర్, విశ్వేశ్వర్ , ప్రో. తిరుమల్ తదితర బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం అబద్ధం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ, ఆ తర్వాతనే అప్పుల పాలయిందని గణాంకాలతో ఎదురుదాడి చేశారు. రాజ్యసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు సరైన ప్రాధాన్యత దక్కిందని ఆమె అన్నారు. బడ్జెట్‌లో బీహార్‌తో పాటు ఎన్డీయే పాలిత రాష్ట్రాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారనడం సరికాదని ఆమె అన్నారు. విభజన నాటికి తెలంగాణ మిగులు బడ్జెట్‌లో ఉందని, ఆ తర్వాత అప్పుల్లో కూరుకుపోయిందని తెలిపారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఏ రాష్ట్రం పట్ల వివక్ష చూపదని స్పష్టం చేశారు. ఇందిరా గాంధీ తెలంగాణలోని మెదక్ నుండి పోటీ చేసి గెలిచారని, కానీ అక్కడ రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేసింది ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. సమ్మక్క సారక్క, రామగుండం ప్లాంట్, పసుపు బోర్డు తెలంగాణకు ప్రాధాన్యతాంశాలని ఆమె పేర్కొన్నారు. పసుపు బోర్డును ఇచ్చింది ప్రధాని మోదీయే అని ఆమె అన్నారు. తెలంగాణకు కూడా నిధులు ఇచ్చామని తెలిపారు. తెలంగాణకు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఇచ్చామని నిర్మలాసీతారామన్ వెల్లడించారు.

# ఫిబ్రవరి 19న బిఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలమీద ప్రధానంగా చర్చ జరగున్నది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అనుగుణంగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు చేపట్టవలసిన కార్యాచరణ పై సమగ్ర చర్చ జరగనున్నది.ప్రభుత్వం ఇచ్చిన హామీలను సాధించుకుంటూ, తమ హక్కులను తాము కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలను చైతన్యం చేసేందుకు పార్టీ నాయకత్వం కార్యకర్తలు శ్రేణులు అనుసరించాల్సిన వ్యూహాలు విధానాలపై ఈ విస్తృతస్థాయి సమీక్షా సమావేశంలో చర్చించనున్నారని కేటీఆర్ తెలిపారు. సమగ్ర చర్చ జరిపి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే కీలక సమావేశం కాబట్టి ఆహ్వానితులందరూ ఖశ్చితంగా హాజరు కావాలని కెటిఆర్ స్పష్టం చేశారు.







# డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు మార్చి 8 తర్వాత ప్రొసీడింగ్ ఇస్తాం..

**- తహసిల్దార్ శ్రీనివాస్ హామీ**

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 13(వార్తా వేదిక సూర్య): లాటరీ ద్వారా ఎంపికైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు మార్చి 8 తర్వాత ప్రొసీడింగ్స్ ఇస్తామని నల్గొండ తాసిల్దార్ శ్రీనివాస్ హామీ ఇచ్చారు.



గురువారం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలోకి సుమారు రెండు వందల కుటుంబాలు గృహప్రవేశాలు చేయడానికి వెళ్లారు. ఆ సందర్భంలో పోలీసుల తో కలిసి నల్గొండ తాసిల్దార్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల దగ్గరికి వచ్చి లబ్ధిదారులతో కలిసి మాట్లాడారు. మార్చి 8 వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రభుత్వం ఎలాంటి సంక్షేమ పథకాలు చేపట్టలేకపోతుందని అన్నారు. గత రెండు సంవత్సరాల క్రితమే లాటరీ ద్వారా ఎంపిక చేసినందున ఎన్నికల కోడ్ అయిపోయిన వెంటనే ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇచ్చి మౌలిక సదుపాయాలు కల్పించి స్వాధీనం చేస్తామని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు.

**మార్చి 10న తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా**

గతంలో ఆర్డిఓ లాటరీ ద్వారా ఎంపికైన వారికి మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు ఎలాంటి మౌలిక సదుపాయాల కోసం పనులు చేపట్టకుండా అలాగే వదిలేయడంతో ఈ రోజు లబ్ధిదారులు ఇల్లు కిరాయిలు కట్టుకోలేక ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఉండడానికి కోసం వచ్చారని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పోరాట సాధనా కమిటీ కన్వీనర్ అవుట రవీందర్ తెలిపారు. తాసిల్దార్ శ్రీనివాస్ ఇచ్చిన హామీ మేరకు మార్చి 8 నాటికి ప్రొసీడింగ్స్ ఇవ్వని ఎడల మార్చి 10న తాసిల్దార్ కార్యాలయం ముందు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో సహా ధర్నా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం, పట్టణ



కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య హాజరై సంఘీభావం ప్రకటించారు పేదల కు ఇల్లు దక్కే వరకు వారికి అండగా ఉంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహేష్ జహంగీర్ ఇలియాస్ నగీన లక్ష్మి శిల్ప ప్రభాకర్ రాణమ్మ పూల నాగయ్య పావని తదితరులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో సమస్యలు పరిష్కరించేందుకు ప్రతిపాదనలు పంపండి : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్గొండ, ఫిబ్రవరి 13 (వార్తా వేదిక సూర్య): గుండ్లపల్లి డిండి సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో డ్రైనేజీ సమస్యను, సోలార్ లైట్ల సమస్యను పరిష్కరించేందుకు తక్షణమే ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. గురువారం రాత్రి ఆమె నల్గొండ జిల్లా, గుండ్లపల్లి డిండి సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల, పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల పరిసరాలను, వంటగదిని ,స్టోర్ రూమ్ , తరగతి గదులను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనానికి సంబంధించిన వంట సరుకులను తనిఖీ చేశారు. అనంతరం ఇంటర్మీడియట్ ,5 ,6 తరగతి గదులలోకి వెళ్లి విద్యార్థినిలతో ముఖాముఖి మాట్లాడి వారి విద్య పరిజ్ఞానాన్ని ప్రశ్నలు, జవాబుల ద్వారా పరీక్షించారు. విద్యార్థినిలు బాగా చదువుకోవాలని,




సమయాన్ని వృధా చేయవద్దని, విద్యద్వారానే సమాజంలో మంచి స్థానాన్ని పొందవచ్చు అని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మంచి జవాబులు ఇచ్చిన విద్యార్థులకు చాక్లెట్లను పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపల్ శిరీష, ఉపాధ్యాయులు ఉన్నారు.

అంతకు ముందు జిల్లా కలెక్టర్ గుండ్లపల్లి డిండి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు . జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ సందర్భంగా ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తాళం వేసి ఉండడం, 20 నిమిషాల తర్వాత వాచ్ మెన్ వైద్య ఆరోగ్య కేంద్రానికి రాగా పి హెచ్ సి లో ఎవరూ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాచ్ మెన్ ను సర్వీస్ నుండి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్, ఇతర సిబ్బందికి మెమోలు జారీ చేయాలని చెప్పారు.

# గురుకులాల్లో ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాల యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ప్రీ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో మర మ్మతులు చేపట్టాలి, కిటికీలు, ప్రధాన ద్వారాలు కూడా దోమతెరలు ఏర్పాటు చేయాలని అందుకు అవసరమైన నిధులు వెంటనే కేటాయిస్తామని మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్లు తెలిపారు.

బీసీ స్టడీ సెంటర్లు ఉద్యోగ కల్పన కేంద్రాలుగా ఉండాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జాబ్ క్యాలెండర్ను అనుసరించి స్టడీ సెంటర్లలో కోచింగ్ నిర్వహించాలని కోరారు. డీఎస్సీ, బ్యాంకింగ్ వంటి పరీక్షల పైన దృష్టి సారించాలని ఆదేశించారు. గురుకులాల్లో ఒకేషనల్ కోర్సులు ప్రవేశం పెట్టడం మూలంగా ఉపాధి లభించే అవకాశం ఉందని మంత్రులు అభిప్రాయపడ్డారు. రెగ్యులర్ కోర్స్‌తో పాటు ఒక కోర్స్ ఒకేషనల్ కోర్సులకు కేటాయించాలని.. అందుకు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. రెసిడెన్షియల్ పద్ధతిలో విద్యార్థులు పూర్తిగా అందుబాటులో ఉంటున్న నేపథ్యంలో ఒకేషనల్ కోర్సులు ప్రవేశపెడితే ప్రయోజనం ఉంటుందని తెలిపారు.ఆర్టీసీలో ఎలక్ట్రికల్ బస్సుల కొనుగోలు.. వాటి నిర్వహణకు అవసరమైన ఛార్జింగ్ స్టేషన్స్ ఏర్పాటుపై సమావేశంలో చర్చిం చారు. ఆర్టీసీ ఆస్తులు.. నిర్వహణ, ఆదాయ వనరులపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, ఆర్టీసీ ఎండి సజ్జనార్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ సోదరుడు కొండల్ రెడ్డి జేబులోకి ఇసుక ఆదాయం

మొదటి పేజీ తరువాయి..

ఇసుక మాఫియాతో రాష్ట్రం తన ఆదాయం కోల్పోయి, అది కొండల్‌రెడ్డి జేబుల్లోకి వెళుతోందని బీఆర్ఎస్ యువ నేత, కార్పొరేషన్ మాజీ చైర్మన్ మన్నె క్రిశాంక్ సంచలన ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి అకమ ఇసుక దందా వివరాలను త్వరలోనే మరిన్ని బయట పెడతామని క్రిశాంక్ వెల్లడించారు.

పంజాబ్ కాంగ్రెస్ నేత నవజ్యోత్ సింగ్ సిద్దూ గతంలో మంత్రి హోదాలో వచ్చి కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన ఇసుక పాలసీని ప్రశంసిం చారు. తమ రాష్ట్రంలో కూడా ఈ పాలసిని ప్రవేశపెడతామన్నారు.

రేవంత్ పాలనలో అక్రమ ఇసుక దందా పెరిగింది .రాష్ట్రానికి ఆదాయం తగ్గింది. కేసీఆర్ హాయంలో కొత్త ఇసుక పాలసీతో ప్రతీ ఏడాది 800 కోట్ల రూపాయలకు పైగా ఆదాయం వచ్చింది.ఉమ్మడి రాష్ట్రంలో ఇసుక ఆదాయం ఏడాదికి 19 కోట్లు కూడా దాటలేదు. రాష్ట్రానికి రావాల్సిన ఇసుక ఆదాయం రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి జేబు లోకి వెళ్తోంది. ఎనుముల కొండల్ రెడ్డి ఇసుకమాఫియా తో రాష్ట్ర ఖజానా కు నష్టం వాటిల్లుతోంది

ఇందిరమ్మ ఇండ్లకు ఉచిత ఇసుక పేరు తో టన్నుల కొద్దీ ఇసుక ను తరలించి అమ్ముకుంటున్నారు. మేడిగడ్డ బారేజి తో పాటు కొన్ని ప్రాజెక్టు ల దగ్గర నీళ్లు ఖాళీ చేసి మరీ ఇసుక ను తరలిస్తున్నారు. ఆదాయమేమో తక్కువ చేసి చూపుతున్నారు. ఇసుక అంతా ఎక్కడికి వెళ్తోంది ? లారీల అసోసియేషన్ కూడా ఓవర్ లోడింగ్ పై అభ్యంతరాలు వ్యక్తం చేశారు

సీఎం రేవంత్ రెడ్డి ఇసుక పై రివ్యూ చేస్తే అవినీతి తగ్గించడానికి అనుకున్నాం. అయితే అలాంటి చర్యలు తీసుకోకపోగా పెంచేందుకు బాటలు వేశారు. మూడు షిఫ్ట్ ల్లో ఇసుక మైనింగ్ చేయాలనీ తాజా మినరల్ డెవెలప్ మెంట్ కార్పొరేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు కేంద్ర ప్రభుత్వ పర్యావరణ నిబంధనలకు విరుద్ధం.

24 గంటల ఇసుక మైనింగ్ రేవంత్ రెడ్డి కుటుంబ ఆదాయం పెంచడానికే తప్ప ,రాష్ట్ర ఆదాయం పెంచడానికి కాదు. మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కు ఈ ఏడాదిలో ఐదుగురు ఎండీ లు మారారు. రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి జరిగిన ఇసుక అమ్మకాలన్నీ బయట పెట్టాలి. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఈ అంశాన్ని లేవనెత్తుతుంది.

స్పీకర్ సమక్షం లో ఇసుక రికార్డులన్నీ బయట పెట్టాలి. రేవంత్ అధికారం లోకి వచ్చాక 200 కోట్ల మేర ప్రభుత్వానికి ఇసుక ఆదాయం తగ్గింది. ఇసుక మీద ఎనిమిది వందల కోట్ల రూపాయల టార్గెట్ కోసం నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. కేసీఆర్ హయం లో ఇసుక పై పదేండ్లలో 5900 కోట్ల ఆదాయం వచ్చింది. అపుడు ఉదయం 6 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకే ఇసుక మైనింగ్ జరిగేది. రేవంత్ రెడ్డి ఇసుక అక్రమ దందాలపై మరిన్ని వివరాలు త్వరలోనే బయట పెడతాం

# మేమూ 'పింక్' బుక్ రాస్తున్నాం!

(మొదటి పేజీ తరువాయి)

విలేకరులతో మాట్లాడారు.

ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. రైతు డిక్లరేషన్‌పై నిలదీస్తారని రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని విమర్శించారు. సామాజిక మాధ్యమాల్లో చిన్న విమర్శ చేసినా సీఎం రేవంత్ భయపడుతున్నారని, పోస్టు చేసిన మరుసటి నాడే ఇంటికి పోలీసులు వచ్చి వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా రాజ్యాంగాన్ని పట్టుకొని రాహుల్ గాంధీ తిరుగు తారని, కానీ తెలంగాణలో మాత్రం రేవంత్ రెడ్డి రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే దగా, మోసమని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లను పెంచడానికి శాసన సభలో బిల్లు ప్రవేశపెడుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక డిమాండ్ చేశారు. బీసీ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపి చేతులు దులుపుకుంటే కుదరదని, దాన్నిఆచరణ సాధ్యం అయ్యేలా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

బీసీలకు విద్యా, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్ల పెంపునకు ఒక్క బిల్లు కాకుండా మూడు వేర్వేరు బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీల జనాభా 46 శాతం ఉందని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో విద్యా రంగంలో ఆ వర్గానికి 46 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక బిల్లు పెట్టాలని, ఉద్యోగాల్లో 46 శాతం రిజర్వేషన్లకు మరొక బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కాబట్టి ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మరొక బిల్లును పెట్టాలని సూచించారు.

బీఆర్ఎస్ పార్టీ, తెలంగాణ జాగృతి, బీసీ సంఘాలు చేసిన ఉద్యమాలకు దిగొచ్చిన ప్రభుత్వం బీసీ బిల్లు పెడుతామని ప్రకటించిందని, ఇది బీసీలందరి విజయమని, ఇది తొలి విజయం మాత్రమేనని స్పష్టం చేశారు. అయితే, కాంగ్రెస్ ధోకేబాజ్ పార్టీ అని, మాటలు చెప్పి మోసం చేయడం ఆ పార్టీకి అలవాటు అని అన్నారు.బిల్లును ఆమోదించిన మరుసటినాడే దానికి సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేస్తేనే ఎన్నికల్లో రిజర్వేషన్లు సాధ్యమవుతాయని, కానీ జాప్యం చేసి ఇతరులు కోర్టుకు వెళ్లడానికి అవకాశం ఇచ్చి చేతులు దులుపుకోవాలని ప్రభుత్వం చూస్తున్నట్లు నిర్దిష్టమైన సమాచారం ఉందని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి ఎత్తుగడలు వేస్తే సహించబోమని, బీసీలంతా కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధిచెబుతారని హెచ్చిరించారు.

మళ్లీ కుల సర్వేకు అవకాశం ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని, కానీ 15 రోజుల కాకుండా నెల రోజుల పాటు సమయం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. హైదరాబాద్ లో 60 శాతం మంది తమ ఇళ్లకు సర్వే చేసే వారు రాలేదని అంటున్నారని, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉందని చెప్పారు.

ఈ రీత్యా రీ సర్వేపై ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేయాలని, టోల్ ఫ్రీ నెంబరును విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పత్రికల్లో పెద్ద ఎత్తున ప్రకటనలు ఇవ్వాలని, ముఖ్యమంత్రి బొమ్మలు కాకుండా బీసీలకు ప్రయోజనం కలిగేలా ప్రచారం చేయాలని సూచన చేశారు.

కేసీఆర్ హయాంలో గ్రామాల్లో నీళ్లు పారాయి.. నిధులు పారాయని, కానీ రేవంత్ రెడ్డి పాలనలో మాత్రం గ్రామాలకు నీళ్లు, నిధులు రావడం లేదని తెలిపారు. 95 పూర్తయిన సమ్మక్క సారక్క బ్యారేజీ పనులను పూర్తి చేయలేని చేతగాని దద్దమ్మ కాంగ్రెస్ ప్రభుత్వం అని విరుచుకుపడ్డారు. కేవలం 5 శాతం పనులను పూర్తి చేయలేని అసమర్థత కాంగ్రెస్ ప్రభుత్వానిదని విమర్శించారు. స్టేషన్ గణపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని అడిగారు.

అవకాశవాదం కోసమే స్టేషన్ గణపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీ హరి పార్టీ మారారని, కడియం శ్రీహరిని ప్రజలు క్షమించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ పార్టీ సుప్రీం కోర్టులో పిటిషన్ వేసిందని, న్యాయ వ్యవస్థపై మాకు సంపూర్ణ విశ్వాసం ఉందని, కాబట్టి పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ కు అనుకూలమైన తీర్పు వస్తుందన్న నమ్మకముందని వివరించారు. ఉప ఎన్నిక వస్తే అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.ఇచ్చినహామీ ప్రకారం నెలకు రూ.2500 ఇవ్వకుండా, స్కూటీలు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను వేధిస్తోం దని, కళ్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్‌లు మాయమయ్యాయని ఎండ గట్టారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి మానవత్వం లేదని మండి పడ్డారు. కళ్యాణలక్ష్మీతో పాటు తులం బంగారం ఇవ్వాల్సిందని, ఆడబిడ్డలను మోసం చేసిన మహమ్మారి కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళలు బుద్ధిచెబతారని అన్నారు.

విదేశీ విద్యా స్కాలర్ షిప్ నిధులు కూడా విడుదల చేయని దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని, ఫీజు రియింబర్స్ మెంట్ చేయ కుండా విద్యార్థులను ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని అన్నారు. రైతు భరోసా పేరిట రేవంత్ రెడ్డి రైతులను మోసం చేస్తున్నారని, రుణమాఫీ అందరికీ కాలేదు.. కానీ పూర్తయిందని ప్రభుత్వ పెద్దలు గొప్పలు చెప్తున్నారని విమర్శించారు. జనగామ జిల్లా పర్యటనకు విచ్చేసిన ఎమ్మెల్సీ కవిత.. పెంబర్తిలో హస్తకళాకారుల సొసైటీ సభ్యులను కలిసి వారి సమస్యలను, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలిఘటించారు. ప్రముఖ మహమ్మాయి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. స్థానిక మహిళలతో కవిత ముచ్చటించారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY






# చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి క్షమించరాని నేరం

## బాలాజీ టెంపుల్ అర్చకులు రంగరాజన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం : గౌడ సంఘం నాయకులు

**మొయినాబాద్,ఫిబ్రవరి 13(వార్త వేదిక సూర్య):** మండల పరిధిలోని చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ గారిని పెద్ద సంఖ్యలో గౌడ సంఘం నాయకులు పరామర్శించడం జరిగింది.

చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్ పై రామరాజ్యం సైన్యం పేరుతో దాడులకు పాల్పడడం క్షమించరాన్ని నేరమని మొయినాబాద్ మండల సంఘం సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగరాజన్ పై దాడికి పాల్పడ్డ దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నాడు చిలుకూరు బాలాజీ ఆలయాన్ని సందర్శించిన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రెనట్ల మల్లేష్ గౌడ్ గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సిద్దెంతి నరసింహ గౌడ్ మొయినాబాద్ మండలం గౌడ సంఘం ప్రెసిడెంట్ బసవపురం ఆంజనేయులు గౌడ్,చిలుకూరు అధ్యక్షులు సిద్దెంతిశభాష్ గౌడ్ చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకులు రంగరాజన్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా రంగరాజన్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. రామరాజ్యం సైన్యం పేరుతో దుండగులు చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్ పై దాడికి పాల్పడడం క్షమించరాని నేరం అన్నారు. ప్రభుత్వం దోషులను తక్షణమే అరెస్టు చేసి చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా భవిష్యత్తులో ఆలయాలపై ఇలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు సూచించారు.

పాల్గొన్న వారిలో సురంగల్ అశోక్ గౌడ్, ఎనకపల్లి సత్యనారాయణ గౌడ్, సురేష్ గౌడ్, అందపురం కృష్ణ గౌడ్, చిన్న మంగళారం విష్ణు గౌడ్, రెడ్డిపల్లి సర్పంచ్ కరుణాకర్ గౌడ్, హిమాయత్ నగర్ రాజు గౌడ్, అజిత్ నగర్ నరేందర్ గౌడ్, నాగిరెడ్డి గూడ అశోక్ గౌడ్, శ్రీరామగర్ పెద్ద మల్లేష్ గౌడ్, తోల్కట్ట మల్లేష్ గౌడ్, చాకలి గూడెం వెంకటేష్ గౌడ్, స్టేట్ యువజన విభాగ అధ్యక్షులు కౌకుంట్ల మల్లేష్ గౌడ్, పెద్ద సంఖ్యలో గౌడ సంఘం నాయకులు పాల్గొనడం జరిగింది.

# కాంగ్రెస్ నాయకులకు కౌంటర్ ఇచ్చిన మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ కురుమ



**గండిపేట్, (వార్త వేదిక సూర్య):** ఎవరి దయ మీద తాను ఆధారపడి లేనని, స్వయం కృషితో ఎదిగానని మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ కురుమ అన్నారు. కాంగ్రెస్ నాయకులకు గురువారం ఆయన కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు గురువారం మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ లోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. డివిజన్లోని బాబుల్ రెడ్డి నగర్ ప్రజలు ముక్తకంఠంతోని తనను నిలబడాలని కోరితే అప్పుడున్న పట్టణ అధ్యక్షులు, స్వర్గీయ సామ ప్రభాకర్ రెడ్డి, అప్పుడు, ఇప్పుడు ఉన్న రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు టికెట్ కేటాయించగా అలయన్స్ లో భాగంగా బిజెపికి చెందిన దివంగత బండి ప్రతాపరెడ్డికి రావడం జరిగిందన్నారు. బండి ప్రతాపరెడ్డి తనపై అభిమానంతో పోటీకి విరమించుకోని తనను పోటీచేయి అని చెప్తే ఆయన దయతో తనకు కౌన్సిలర్ గా పోటీ చేయడానికి అవకాశం లభించిందన్నారు. ఎవరి దయాదాక్షిణ మీద కౌన్సిలర్ కాలేదన్నారు. బాబుల్ రెడ్డి నగర్ కి కౌన్సిలర్ అయిన తర్వాత స్కూల్ బిల్డింగ్ లేకుంటే అద్దె బిల్డింగ్ తీసుకొని అద్దె చెల్లించి పేద పిల్లలకు చదువు చెప్పించానని, టీచర్లు నియమించి వారికి జీతాలు ఇచ్చానని అన్నారు. జన్మభూమి కార్యక్రమంలో 33 శాతం సొంత డబ్బు పెట్టి రోడ్లు, డ్రైనేజ్ చేయించానన్నారు. ఇప్పటికీ అవే రోడ్లు ఉన్నాయన్నారు. అప్పట్లో ఏ వీధిలో నీళ్లు లేకుంటే బోర్లు వేయించి మోటర్ బిగించి సొంత పైసలతో పైప్ లైన్ ప్రతి వీధికి నీళ్లు ఇచ్చానన్నారు. అదేవిధంగా రాజేంద్రనగర్ మున్సిపాలిటీలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్లోని మొట్టమొదటిసారిగా నల్లా నీళ్లు, మంచినీటిని బాబుల్ రెడ్డి నగర్ లోనే స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి నగరబాట కార్యక్రమంలో వచ్చి ప్రారంభించినట్లు తెలిపారు. ఇలా చెప్పుకుంటూ పోతే వీధి స్తంభాలు కానీ వీధిలైట్లే గాని సివరేజ్ లైన్ అండర్ గ్రౌండ్, మురికి కాలువలు, స్కూల్ బిల్డింగ్, మహిళా బిల్డింగ్, బాబుల్ రెడ్డి నగర్ లోకి లింకు రోడ్డు లేకుంటే పడాల రామారెడ్డి చెల్లెలి తో మాట్లాడి ఆ రోడ్డు కూడా వేయించినట్లు గుర్తు చేశారు. కానీ చెడు మాత్రం ఎవరికీ చేయలేదన్నారు. ఎవరి దగ్గర చిల్లి గవ్వ కూడా ఆశించకుండా మున్సిపల్ అధికారులు ప్రజలకు ఇబ్బంది పెట్టకుండా చూశానన్నారు. తన మంచితనానికి ఇప్పటికీ కూడా తనను కౌన్సిలర్ వెంకటేష్ అని పిలుస్తారని, అది నా బ్రాండ్ అని తెలిపారు. నేను నా అనుచరుల విషయానికొస్తే తనను నమ్ముకున్నోళ్లకు ద్రోహం మాత్రం చేయలేదని, ఏం చేశావు అనేవారికి రండి చూపిస్తానని తెలిపారు.

# వ్యాపారులు సిండికేట్‌తోనే మిర్చి రేటు


**తొర్రూర్, ఫిబ్రవరి 13(వార్త వేదిక సూర్య):** లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టిన రైతాగం పండించరా మిర్చి పంటకు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలవుతున్నారని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. జిల్లా కేంద్రమైన మహబూబాబాద్ లోని మాస్ లైన్ కార్యాలయంలో నేడు జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపార వర్గం అధిక లాభాల కోసం సిండికేట్ గా ఏర్పడి కష్టపడ్డ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. లక్షల రూపాయల పెట్టుబడులతో కుటుంబం రాత్రి పగలు తేడా లేకుండా శ్రమతో పంటలు పట్టిస్తే ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు. మిర్చి క్వింటల్ కు 23 వేలు ఉండగా నేడు 12 వేల వరకు ఎలా తగ్గిందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు పండించిన పంటలకు బోనస్ ఇస్తారని ఇచ్చిన హామీ మిర్చి రైతుల విషయంలో ఎందుకు అమలు చేయాలని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరల చట్టాలు చేసి అంతర్జాతీయ చాలా డిమాండ్ ఉన్న మిర్చికి ధరలు 35000 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులలో ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఆరు ఏడు వందలు నష్టపోతున్నారని దిన్ని గ్రహించి రైతులు ఉద్యమించాలని అన్నారు. రైతాగం ఐక్యమై గిట్టుబాటు ధరకు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. ఇంకా ఈ



సమావేశంలో లిసిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి,జిల్లా నాయకులు పూనెం ప్రభాకర్,ముల్కూరు జగ్గన్న,ముంజంపల్లి వీరన్న, బిళ్ళ కంటి సూర్యం నాయకులు పైండ్ల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.


# మణికొండ మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

## కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేసిన బీఆర్ఎస్ నాయకులు



**గండిపేట్, (వార్త వేదిక సూర్య):** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని మున్సిపల్ కార్పోరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం దూళిపాల రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు. ఈ మేరకు గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2019లో రూ.45 లక్షల బడ్జెట్ తో బాబా సాహెబ్ అంబేద్కర్ భవనాన్ని నిర్మించాలని శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ ఇప్పటివరకు ఆ నిర్మాణం చేపట్టలేదనితెలిపారు. ప్రస్తుతం 75వ రాజ్యాంగ నిర్మాణ సంవత్సరం కావడం సందర్భంగా అంబేద్కర్ భవన నిర్మాణం గురించి చర్యలు చేపట్టాలన్నారు. పుప్పాలగూడ గ్రామానికి సంబంధించిన స్మశాన వాటికకు వెళ్లేందుకు సరైన రహదారి లేదని పునర్నిర్మించాలన్నారు. ఇప్పుడున్న బిల్డర్ల ఆర్ఎంసి ప్లాంటును తొలగించాలని కోరామన్నారు. ముస్లింల స్మశాన వాటికకు నెక్నాంపూర్ గ్రామంలో స్థలం కేటాయించాలని అన్నారు. దాదాపు సంవత్సరం క్రితం సర్వే చేసి రిపోర్టు దాఖలు చేయమని తహశీల్దార్ సూచించినప్పటికీ ఇప్పటి వరకు సర్వేయర్ లేడనే కారణంతో చేయలేదన్నారు. కొన్ని వేలమంది ముస్లిం సోదరులకు ఉపయోగ పడే స్మశాన వాటికకు స్థలాన్ని వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. 75వ రాజ్యాంగ నిర్మాణ సంవత్సరాల్ని పురస్కరించుకొని పుప్పాల గూడ హుడా కాలనీ పార్క్ వద్ద అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని వివరించామన్నారు.

ఈ మేరకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ స్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభగళ్ల ధనరాజ్, గుట్టమిది నరేందర్, ఉపేందర్ నాథ్ రెడ్డి, అందె లక్ష్మణరావు, సంఘం శ్రీకాంత్, రామ సుబ్బారెడ్డి, సుమన్, భానుచందర్, ఆరిఫ్ మహమ్మద్, సుమనళిని, హుస్సేన్, అశ్వక్ అలి, మనీ బొడ్డు, శ్రీధర్, తిరుపతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# వాహనాలకు సంబంధించిన ఒరిజినల్స్ ఉంటే బాధితులకు అందిస్తాం..

**- పెద్ద శంకరంపేట ఎస్సై శంకర్**

**పెద్ద శంకరంపేట(వార్త వేదిక సూర్య):** గత కొన్ని నెలలుగా ఎలాంటి డాక్యుమెంట్స్ లేని ఐదు వాహనాలను పెద్ద శంకరంపేట పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ నందు భద్రపరిచారు.. ఇందులో డిస్కవరీ 125 ఒక వెహికల్ TS29AS 4082.. నాలుగు ఆటోలు వెహికల్ నెంబర్ల వారీగా TS15UD1030... AP28UV4975.. MD2A96A YXKWB15297.. MD2A26AAZ6DWH 45589 .. పై నెంబర్లు గల వాహనాలకు సంబంధిత ఒరిజినల్ ధ్రువపత్రాలను పెద్ద శంకరంపేట పోలీస్ స్టేషన్ లో తీసుకొచ్చి చూపించినచో వాటిని వాహనదారులకు అప్పగించబడునని పెద్ద శంకరంపేట ఎస్సై శంకర్ తెలిపారు..







# అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నాగేశ్వర్ రావు

**గండిపేట్, (వార్త వేదిక సూర్య):** అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్‌గా నాగేశ్వర్ రావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ రాజేంద్రనగర్ ఏసిపి శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు నూతన ఇన్‌స్పెక్టర్ ఏసీపీకి పుష్పగుచ్చం అందజేశారు.

# పేద విద్యార్థికి అండగా నిలిచిన మణికొండ రెడ్డి ఫౌండేషన్ సభ్యులు

**గండిపేట్, (వార్త వేదిక సూర్య):** కష్టాల్లో ఉండి చదువుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి మణికొండ రెడ్డి ఫౌండేషన్ సభ్యులు అండగా నిలిచారు. మణికొండ మున్సిపాలిటీకి చెందిన సిరిపూర్ణి స్థానికంగా యూనిసెంట్ స్కూల్లో పదవ తరగతి చదువుతుంది. కాగా ఆర్థిక ఇబ్బందులు పడుతూ ఫీజు చెల్లించకపోవడంతో ఫౌండేషన్ తరపున రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. రెడ్డి ఫౌండేషన్ పేదలకు తమ వంతుగా ఆర్థిక సాయం చేస్తూ వస్తుందన్నారు. పేద విద్యార్థికి



ఆర్థికంగా ఆదుకొని ఫీజు చెల్లించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సుభాష్ చంద్ర రెడ్డి, బొమ్ము ఉపేంద్రనాధ్ రెడ్డి, రామసుబ్బా రెడ్డి,శరత్ రెడ్డి, శ్రీపతి రెడ్డి, రాధా, సైది రెడ్డి, రాజా రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సుధాకర్ రెడ్డి, బొడ్డు శ్రీధర్, పాప తల్లి దేవి ప్రియా తదితరులు పాల్గొన్నారు.

# దుర్గానగర్ చౌరస్తాను సందర్శించిన మున్సిపల్ విభాగం అధికారులు, ట్రాఫిక్ పోలీసులు


**గండిపేట్, (వార్త వేదిక సూర్య):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని దుర్గానగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై జీహెచ్ ఎంసీ ఈఈ నరేందర్ గౌడ్, ఏఈ నర్సింహ్మ మూర్తి, ట్రాఫిక్ సిబ్బంది దృష్టి సారించారు. అందులో భాగంగా గురువారం దుర్గానగర్ చౌరస్తా ను సందర్శించారు. ప్రధానంగా దుర్గా నగర్ జంక్షన్ వద్ద రోడ్డు మధ్యలో ఉన్న డ్రైనేజ్ లైన్ సైడ్ నుంచి వేయడానికి



ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. డ్రైనేజీలైన్‌ను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

# దళిత బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరిన బస్తీవాసులు

**గండిపేట్, (వార్త వేదిక సూర్య):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో దళిత బస్తీలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, సీనియర్ నాయకుడు లలిత్ వర్రీలు చూపుతున్న చొరవను బస్తీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానికంగా ఎదురవుతున్న సమస్యలను ఎమ్మెల్యేను కలిసి




విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. డ్రైనేజీ సమస్యను బస్తీ వాసులు గత కొంత కాలం నుండి ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. రాజేంద్రనగర్ శాసన సభ్యులు ప్రకాష్ గౌడ్ ఆదేశాలతో, సీనియర్ నాయకుడు వర్రి లలిత్ చొరవతో నూతన డ్రైనేజీ పైపు లైన్ మొదలు పెట్టారన్నారు. దీనికి సహకరించిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, రాజేంద్రనగర్ విలేజ్ ప్రెసిడెంట్ మూడుమాల శ్రీకాంత్, రాజేంద్రనగర్ కాంగ్రెస్ నాయకులు, బస్తీ వాసులు ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలిపారు. అంతే కాకుండా రాజేంద్రనగర్ లోని స్మశానవాటికలో నీటి పంపు (బోర్) వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్రి లలిత్, రాపోలు సత్తయ్య, పత్తి రాజు, నయీం, పతీయర నరసింహ, పంబాల రాజు, చేరుకుల రవి, రఫీక్, నిఖిల్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY



# మలిజీవితం పలువురికి ఆదర్శం

**(వాలీంటర్స్ డే సందర్భంగా స్పెషల్ స్టోరీ)**



**మోత్కూరు ఫిబ్రవరి 13 ( వార్త వేదిక సూర్య)** మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ధర్మపురం గ్రామానికి చెందిన ఎర్రోజు యశ్వంత్ చారి అదే గ్రామానికి యాదవ కులానికి చెందిన వర్రె కిరణ్మయి"ని 10- 07 -2006న ఆంధ్రప్రదేశ్ లోని అన్నవరం"లో సత్యనారాయణ స్వామి ఆలయంలో పెద్దలను ఎదురించి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఈ ప్రేమ-వ్యవహారంలో తెలిసి ఇరువర్గాల పెద్దలు పెళ్లినాటి విషయం తెలిసి తమను ఎదిరించిన ఆ కొద్ది కాలానికే మా దంపతుల అన్యోన్యంగా జీవిస్తున్న జీవితం చూసి రెండు కుటుంబాలు పెద్దలు సంతోషపడ్డారు. మాకు ఇద్దరు పిల్లలు ఒక అబ్బాయి,ఒక అమ్మాయి. మా అబ్బాయి ప్రణయ్ సూర్య ఇంటర్మీడియట్ సెకండియర్, అమ్మాయి వేణుశ్రీ ఇంటర్మీడియట్ ఫస్టియర్ వీరిద్దరూ హైదరాబాద్ లోని నారాయణ విద్యాసంస్థలలో చదువుతున్నట్లు తెలిపారు యశ్వంత్ చారి- కిరణ్మయి ఫిబ్రవరి 14న వాలీంటర్స్ డే సందర్భంగా "వార్త వేదిక సూర్య" ప్రతినిధితో పలు విషయాలు పాలుపంచుకున్నారు. మేము ప్రేమించి పెళ్లి చేసుకున్నప్పటికీ మా ఇరువురు అత్తగారింటికి ఒకరునొక్కారు వెళ్తున్నాం. ఆయా కుటుంబాలలో ఏ శుభకార్యాలు జరిగిన, అందరి బంధులలో కలిసి మా వివాహ జంట తోడుగా వెళ్తుంటే ఈ జోడి బాగుందని పలువురు మాజంట చూసి అభినందిస్తున్నట్లు వారు తెలిపారు. మా వివాహమై 19 సంవత్సరాలు అవుతున్న ప్పటికీ కొన్ని కొన్ని సందర్భాలలో చిన్న, చిన్న సమస్యలు ఏర్పడిన ఆ వెంటనే ఇరువురిలో ఎవరొకరు సరిదిద్దుకొని మచ్చలేని జీవితం కొనసాగిస్తున్నట్లుగా చెప్పుకొచ్చారు.

తమ ఇద్దరు పిల్లలు కూడా తల్లిదండ్రులను గౌరవిస్తున్నారని చదువులో మంచిగా రాణిస్తున్నరని తెలిపారు. నేటి సమాజంలో ఒక అమ్మాయిని, ఒక అబ్బాయిని కానీ ప్రేమించేటప్పుడు కులం లేనిది పెళ్లి చేసుకున్నాక మీది, వేరే కులం మాది వేరే కులం అంటున్నారని ప్రేమికుల విషయంలో అనేకం చూస్తున్నామని అబ్బాయిని అమ్మాయి వాళ్లు అనటం ఏదో రకంగా అమ్మాయి వాళ్ళు అబ్బాయి మరో రకంగా అనటం వాళ్లిద్దరూ విడదీయటం చూస్తుంటే బాధేస్తుందని అన్నారు.

విడదీయమైన ప్రేమను తట్టుకోలేక కొంతమంది పెద్దలను ఎదిరించలేక సూసైడ్ వంటి చేసుకుంటుంటే తమ హృదయం కలిచివేస్తుందన్నారు. ఇద్దరి మనుషులు ఒక్కటై ప్రతి విషయాన్ని ఆ ఇద్దరు షేర్ చేసుకొని జీవితంలో స్థిర పడుతమా అనేది ముందుగా వారిద్దరూ ధైర్యంగా ముందుకు వెళ్తే జీవితంలో విజయం సాధిస్తామని అందుకు తాము ఒక ఉదహారణ అని యశ్వంత్ కిరణ్మయి,తెలిపారు.






## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**వలిగొండ ఫిబ్రవరి 13 (వార్తా వేదిక సూర్య):** మండల పరిధిలోని మొగిలిపాక గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు గుండెపురి రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గురువారం గ్రామానికి చెందిన పాల సంఘం చైర్మన్ భీమనబోయిన బిక్షపతి, మాజీ ఉపసర్పంచ్ భీమనబోయిన నరసింహ మృతుని కుటుంబాన్ని పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గుండెపురి అంజయ్య, భీమనబోయిన మచ్చందర్, పబ్బు బాలకృష్ణ, సింగం మహేష్, గుండెపూరి ఉపేందర్, పబ్బు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# చేనేత పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**- చేనేత జోలి శాఖ ఏడిఓ సాయి కుమార్**



**రామన్నపేట:ఫిబ్రవరి 13(వార్త వేదిక సూర్య):** చేనేత వృత్తిదారులు కార్మికులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేనేత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చేనేత జౌళి శాఖ ఏడిఓ సాయికుమార్, కాటన్ చేనేత సహకార సంఘం అధ్యక్షులు జెల్లా వెంకటేష్ కోరారు. స్థానిక టెర్రి కాటన్ చేనేత సహకార సంఘంలో గురువారం చేనేత వృత్తిదారుల నుండి నేతన్న పొదుపు (త్రిఫ్ట్ ఫండ్) పథకం దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతన్నకు చేయూత త్రిఫ్ట్ ఫండ్ పథకం ప్రారంభించారని, అర్హులైన ప్రతి నేతన్న దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 15 వరకు దరఖాస్తుల స్వీకరించి, మరసటి రోజు నుంచే క్షేత్రస్థాయికి వెళ్లి మొగ్గల పరిశీలన చేస్తామని వారు తెలిపారు. అర్హులైన వారినే గుర్తిస్తామన్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లాలో గతంలో 11 వేల మంది నేతన్నలకు త్రిప్టుఫండ్ వర్తించిందని, ప్రస్తుతం అందరి నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నామని ఇప్పటివరకు 6వేల మంది దరఖాస్తు చేశారన్నారు. నాలుగు వేల దరఖాస్తులు వస్తాయని అంచనా వేస్తున్నామని వారు తెలిపారు. కార్మికుల్లో పొదుపు అలవాటును ప్రోత్సహించడంతో పాటు వారికి సామాజిక భద్రత ఈ పథకాలు కల్పిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సిడిఈ శ్రవణ్, చేనేత సహకార సంఘం దొంత నాగరాజు, నేత వృత్తిదారులు సంగిశెట్టి నారాయణ, సత్యనారాయణ, దొంత శ్రీరాములు, అందే పాండరీ, సత్తయ్య, వనం అంబబుషి, ఈపూరి వెంకటేశం, మిర్యాల జానకి రాములు, రవ్వ నరసింహ, సంగిశెట్టి బాబు, రవ్వ చందు, తదితరులున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**మోత్కూరు, ఫిబ్రవరి 13 (వార్త వేదిక సూర్య):** మోత్కూరు మండలం సదర్శపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త పంజాల దశరథ గురువారం నాడు అనారోగ్యంతో మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి ఆయన భౌతికాయానికి పూలమాలల వేసి నివాళు



లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి..10 వేలు ఆర్థిక సహాయం అందించారు. నివాళులర్పించిన వారిలో టి పీసీసీ నాయకులు పర్రెపాటి ( అద్వకేట్) యుగేందర్, మండల కాంగ్రెస్ నాయకుడు పి.ఏ.సి.ఎస్ మాజీ డైరెక్టర్ తీగల నర్సింహ్మా రెడ్డి, దొండ మల్లయ్య, తీగల చంద్రయ్య, లగ్గాని రమేష్,,తీగల వినోద్, మునుకుంట్ల నర్సయ్య, ఆకుల మహేష్, పర్రెపాటి ప్రవీణ్, నవీన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# షరతులు లేకుండా త్రిఫ్ట్ పథకాన్ని కొనసాగించాలి



**భూదాన్ పోచంపల్లి ఫిబ్రవరి 13, (వార్త వేదిక సూర్య):** చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిఫ్ట్ పథకంలో ఎలాంటి అంక్ష లు లేకుండా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు గురువారం భూదాన్ పోచంపల్లిలో ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జియో ట్యాగ్ కలిగిన వ్యక్తి తో పాటు ఇద్దరు స్కీంలో డబ్బు జమ చేసుకోవడం జరిగిందని తెలి పారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వము జియో ట్యాగ్ కలిగి ఉన్నటు వంటి అనుసంధానంగా ఒకరికి మాత్రమే అవకాశం కల్పిస్తుందని , ప్రతి రెండు నెలలకోసారి ఎంక్వయిరీ అంటూ కార్మికులను భయాందోళనకు గురి చేస్తుందని ఆ వేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ఏ లాంటి ఆంక్షలు లేకుండా కొనసాగించారో అదేవిధంగా స్కీమును కొనసాగించాలని డిమాండ్ చేశారు.

అర్హులైన వారందరికీ స్కీమ్లో చేరేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నల్ల లక్ష్మణ్, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు గుండు ప్రవీణ్,సిద్దుల ప్రభాకర్, వనం భాస్కర్, సామల విజయ్ , కర్నాటి సుమన్, గుజ్జ లక్ష్మీనారాయణ , బహుజన సమాజ్ పార్టీ పట్టణ అధ్యక్షులు భారత భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

**మోత్కూరు, ఫిబ్రవరి 13 (వార్త వేదిక సూర్య):** మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపూరం గ్రామంలో శ్రీ లక్ష్మీ నర్సింహ్మా స్వామి మండపం వద్ద కల్యాణోత్సవాలు బుధవారం రాత్రి కన్నులపండుగగా



ఘనంగా జరిగాయి. అదే విధంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని అర్చకులు మోత్కూరు, ప్రదీప్ శర్మ, సందీప్ శర్మ, నవనీత్ శర్మ లు ఆధ్వర్యంలో శాస్త్రోకంగా నిర్వహించారు.



## ఘనంగా స్వామివారి రథోత్సవం

**భూదాన్ పోచంపల్లి ఫిబ్రవరి 13 (వార్త వేదిక సూర్య):** మండలంలోని పెద్ద రావులపల్లి గ్రామంలో భూనీల సమేత శ్రీ రంగనాయక స్వామి దేవాలయ వార్షికోత్సవంలో భాగంగా గురువారం స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన రథంపై స్వామివారిని ప్రతిష్టింపజేసి ప్రధాన పురవీదుల గుండా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో పూర్ణాహుతి, చక్ర స్నానం, స్వామివారి ఊరేగింపు, ఆశీర్వచనం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మట్ట బాలమని దర్శన్, మాజీ ఎంపిటిసి చిలక బుచ్చయ్య, దేవాలయం కమిటీ చైర్మన్ జడల అంజయ్య, వైస్ చైర్మన్ చేగూరి ప్రభాకర్, ధర్మకర్తలు చెన్న బత్తిని భూషణ్, గుర్రాల శంకరయ్య, ఏనుగు కొండల్ రెడ్డి, పల్లా విష్ణువర్ధన్ రెడ్డి, పెద్ద బోయిన రామకృష్ణ, కందాల గణేష్, మరి పాల యాదయ్య, సంగెం గణేష్, మోటే బాలు, పంతంగి భానుప్రకాశ్ చారి, వర్కాల భానుచందర్, ఏనుగు సుదర్శన్ రెడ్డి, జడల శివ, అర్చకులు పాల్గొన్నారు.




# చేనేత పరిశ్రమ పరిరక్షణకై కృషి

**- అనంత కుమార్ మిశ్రా**

**భూదాన్ పోచంపల్లి ఫిబ్రవరి 13(వార్త వేదిక సూర్య) :** చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం కృషి చేయాలని సహకార భారతి ఆలిండియా అధ్యక్షుడు అనంత కుమార్ మిశ్రా కోరారు . పట్టణ కేంద్రంలోని కర్నాటి ఫంక్షన్ హాల్ లో సహకార భారతి ఆల్ ఇండియా చేనేత విభాగం ఆధ్వర్యంలో చేనేత సమస్యలపై జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు . ఈ సందర్భంగా చేనేత కార్మికులకు దిశా నిర్దేశం చేశారు . భవిష్యత్తు తరాల కోసం చేనేత సమస్యలపై కార్మికులు ఢిల్లీకి వెళ్లి విన్నవించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సహకార భారతి రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి , జిల్లా చేనేత నాయకుడు చిక్క కృష్ణ ,గంజి బసవలింగం , బిజెపి పట్టణ అధ్యక్షుడు డబ్బికార్ సాహిష్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, చేనేత జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేష్, జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం, మాజీ సర్పంచ్ నోముల గణేష్, నాయకులు ఏలే బిక్షపతి, రుద్ర శ్రీశైలం,రుద్ర చెన్నకేశవులు, కడవెరు శేఖర్, ఏలే శ్రీనివాస్, గోలను కొండ ప్రభాకర్ , రచ్చ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు .

## ఘనంగా షిరిడి సాయిబాబా వార్షిక బ్రహ్మోత్సవాలు

**వలిగొండ, ఫిబ్రవరి 13 (వార్తా వేదిక సూర్య):** మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో 12 వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి సాయి దీక్ష తీసుకున్న సాయి సేవక్ సభ్యులు సుప్రభాత సేవ, కాగడ హారతి, అభిషేకాలు, సామూహిక



సాయి వ్రతములు నిర్వహించారు. అనంతరం భక్తులకు సొసైటీ సౌజన్యంతో అన్న దానం చేశారు. ఈ కార్యక్రమంలో వాణి, సోమనబోయిన సతీష్, బోళ్ల రాంచంద్రం, బోళ్ల శ్రీనివాస్, తాళ్ల శ్రీనివాస్, కనకబోయిన ఆంజనేయులు, మాటూరు సంజీవ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ సి మిస్సింగ్....

**రామన్నపేట:ఫిబ్రవరి 13 (వార్తా వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రానికి చెందిన ఆలకుర్తి లింగా చారి తండ్రి చంద్రయ్య బిజినెస్ చేసుకుంటూ పట్టణంలోని రైల్వే కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇతని మోటార్ కార్ యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్టిఏ ఆఫీసులో రిజిస్టర్ చేయబడినది. తేదీ జనవరి 25న తన ఇంటి నుండి రామన్నపేట పట్టణంలోని జిరాక్స్ సెంటర్ కు తన మోటార్ బైక్ పై వెళ్తుండగా మోటార్ కార్ యొక్క ఆర్ సి ఒరిజినల్ పోగొట్టుకున్నాడు. ఎవరికైనా దొరికిన యెడల ఇవ్వాలని ఒక ప్రకటనలో తెలిపారు.

## ట్రాక్టర్ బోల్తా.. చేపలు మృతి : డ్రైవర్ సురక్షితం



**మోత్కూరు ఫిబ్రవరి 13 (వార్త వేదిక సూర్య):** గుండాల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మత్స్య కార్మికులు వలిగొండ మండలం ఆర్రూరు గ్రామ చెరువులోకి చేప పిల్లలను వదిలి పెట్టాలని ట్రాక్టర్ లోడుతో మోత్కూరు మండలం బుజిలా పురం గ్రామ గుట్ట సమీపంలో చేరుకోగానే ఎదురుగా వస్తున్న వాహనాలను చూసి వెనక్కి వెళ్ళటానికి డ్రైవర్ ప్రయత్నం చేయగా ట్రాక్టర్ బోల్తా పడింది. వెనుకలో ఉన్న ట్రాలీలో ఉన్నా 5 క్వింటాలు చేప పిల్లలు క్రిందపడి చనిపోయాలు...ఈ ఘటనలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు.




## గుండెపోటుతో ఉపాధి హామీ కూలి మృతి

**రామన్నపేట, ఫిబ్రవరి 13 (వార్తా వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రానికి చెందిన శ్యామల లింగమ్మ వయసు 55 సంవత్సరాలు ,భర్త బుచ్చయ్య. ఉపాధి హామీ పనులలో భాగంగా నర్సరీలో పని చేయడానికి వెళ్లారు. గురువారం భోజన విరామ సమయంలో గుండెపోటు రావడంతో 108 వాహనంలో రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందారని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ చెరుపు సత్య నారాయణ, ఏపీవో పున్న వెంకటేష్, మంగమ్మ మరణం గురించి పై అధికారు లకు తెలియజేశారు. సెక్షన్ ఆఫీసర్ స్పందించి ఫీల్డ్ ఆఫీసర్ భాగ్య నాయక్ ను ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నుండి రావాల్సిన ఎక్స్గ్రేషియా అందజేస్తామని అన్నారు.



## ఆన్లైన్ సెంటర్ అక్రమ వసూళ్లపై వ్యవసాయ శాఖ అధికారి విచారణ

**వలిగొండ ఫిబ్రవరి 13 (వార్తా వేదిక సూర్య):** మండల కేంద్రంలోని శ్రీ విద్యా ఆన్లైన్ సెంటర్ లో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ఆన్లైన్ దరఖాస్తులకు వెళ్లిన రైతుల నుండి



అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న ఆన్లైన్ సెంటర్ నిర్వాహకునిపై సిపిఎం ఇచ్చిన ఫిర్యాదుతో మండల వ్యవసాయ శాఖ అధికారి అంజనీ దేవి ఆధ్వర్యంలో ఆ శాఖ అధికారుల బృందం ఈరోజు ఆన్లైన్ సెంటర్ లో విచారణ నిర్వహించి అతడు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలడంతో సిఎస్సి జిల్లా బ్రాంచ్ మేనేజర్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని తెలపారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, సిపిఎం పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం

**గండిపేట్, (వార్త వేదిక సూర్య):** స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించుకొని విద్యార్థులకు చిన్నప్పటి నుంచే వ్యవస్థల గురించి అవగాహన కల్పిస్తున్నామని దుర్గానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు



ఎన్.సుజాత అన్నారు. గురువారం దుర్గానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠ శలలో స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఎన్.సుజాత మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని, ఉపాధ్యాయుల పాత్రను స్వయంగా నిర్వహిస్తూ విలక్షణమైన అనుభవాన్ని పొందారన్నారు. పిల్లలు అందరూ చక్కటి వేషధారణలో ఉపాధ్యాయులుగా మారి తమ విధులను నిర్వహించారన్నారు. నేటి సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ప్రధానమైం దన్నారు. ఉత్తమ పౌరులను తయారు చేయడం ఉపాధ్యాయుల ప్రధాన లక్ష్యమన్నారు. ఒక ఉపాధ్యాయుడు తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తే, రేపటి తరానికి స్ఫూర్తి కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సేవలాల్ జయంతి వేడుకలకు విరాళాన్ని అందజేసిన చిలుక ఉపేందర్ రెడ్డి

**ఎల్ బి నగర్,ఫిబ్రవరి 13 (వార్త వేదిక సూర్య):** ఆర్ కె పురం డివిజన్ లోని ఎన్టీఆర్ నగర్‌లో గల బంజారాకాలనీలో నిర్వహించే శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 268వ జయంతి ఉత్సవాలలో భాగంగా అన్నప్రసాద వితరణకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి విరాళాన్ని అందజేసారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ డాక్యార్ నాయక్, శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహరాజ్ దండి మేరమ్మ దేవాలయ చైర్మన్ నరసింహ, శ్రీ ఖిల్లా మైసమ్మ దేవాలయం డైరెక్టర్ రాజు నాయక్, నరసింహ, బాలు నాయక్, ప్రేమ్ నాయక్, కృష్ణ నాయక్, భాస్కర్, శంకర్, రాజు తార్యి తదితరులు పాల్గొన్నారు.



# ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్న కార్పోరేట్ విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి

### చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు : లింగంగౌడ్

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 13(వార్త వేదిక సూర్య):** పరీక్షల సమయంలో ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్న కార్పొరేట్ స్కూల్స్ కళాశాలల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా కార్పొరేట్ టెక్నో,ఒలంపియాడ్ వంటి స్కూల్లో కాలేజీలో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని విద్యాశాఖ అధికారులు చూచి చూడనట్టుగా వ్యవహరించడమే దీనంతటికి కారణమని ఆన్నారు. కార్పొరేట్ ప్రైవేట్ స్కూల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుకుంటూ పోవడం వల్ల సామాన్య,మధ్యతరగతి బడుగు బలహీన వర్గాల విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఫీజులు చెల్లించే విషయంలో కొద్దిగా జాప్యం జరిగిన విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులను ఎక్కడపడితే అక్కడ అడిగి విద్యార్థులను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాయని అన్నారు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతూ



అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యాశాఖ అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లుగా వివరించడం వల్లనే ఇదంతా జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన యువజన పరిషత్ స్టేట్ ప్రెసిడెంట్ బూర శ్రీనివాస్,మాల విద్యార్థి సంఘం స్టేట్ ప్రెసిడెంట్ చంద్ర మోహన్ రాయ్, ట్రైబల్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు శ్రీను నాయక్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు గోదా రవీంద్ర, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంజీఐటీలో రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభం

**గండిపేట్, (వార్త వేదిక సూర్య):** గండిపేటలోని మహాత్మగాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ మెటీరియల్స్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీస్ అంశం మీద రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మెటలర్జికల్, మెటీరియల్ ఇంజనీరింగ్ విభాగం, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ హైదరాబాద్ విభాగం, టీఆర్ ఆనంతరామన్ ఎడ్యుకేషనల్ అండ్ రిసెర్చ్ ఫౌండేషన్ హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఐ ఐ టి హైదరాబాద్ రిసెర్చ్ అడ్వైసర్, డైరెక్టర్ డాక్టర్ టి.నర్సింగ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు నవీన సాంకేతికత ను అందిపుచ్చుకొని మెరుగ్గా రాణించాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ చంద్రమోహన్ రెడ్డి విద్యార్థులు తమకు అందివచ్చిన అవకాశాలను ఉపయోగించుకుని తమ శక్తి మేరకు దేశాభివృద్ధికి కృషి చేయాలని సలహా ఇచ్చారు. వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి అతిథులను, విద్యార్థులను సదస్సుకు ఆహ్వానించి, సదస్సులోని వక్తలు బోధించే అంశాలు విద్యార్థుల




ప్రగతికి ఎంతగానో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. కళాశాల రిసెర్చ్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ ఈశ్వర ప్రసాద్ విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు పరిశోధనాసక్తిని కూడా అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ ఫణిరాజ్, మెటలర్జికల్, మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శు భాకాంక్షలు తెలిపారు.

# చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి దురదృష్టకరం : అఘోరి నాగసాధువు

**మొయినాబాద్ ఫిబ్రవరి 3 (వార్తా వేదిక సూర్య):** మండల పరిధిలోని చిలుకూరు బాలాజీ ప్రధాన ఆలయ అర్చకులు గంగరాజన్ పైన దాడి చేయడం సరైన పద్ధతి కాదని దురస్దృష్టకరమని అఘోరి నాగసాధువు అన్నారు తెలుగు రాష్ట్రాల్లో తిరుమల తిరుపతి గా ప్రసిద్ధిగాంచిన చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు సిఎస్ రంగరాజన్ దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలంలోని కొప్పవరానికి చెందిన వీరరాఘవరెడ్డి తాను స్థాపించిన రామరాజ్యం సంస్థలో సభ్యులను చేర్పించాలని, తమకు ఆర్థిక సాయం చేయాలని రంగరాజన్ ను డిమాండ్ చేయగా, దానికి ఆయన నిరాకరించారని ఇటీవల చిలుకూరు. బాలాజీ అర్చకుడు రంగరాజన్ పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం ఆలయ అర్చకుడు రంగరాజన్ స్వామిని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు మీడియా సమావేశంలో మాట్లా డుతూ ధర్మం కోసం పోరాడే వ్యక్తిని దాడి చేయడం ఘోరమన్నారు ధర్మానికి పనిచేసిన వ్యక్తికి ఆ ధర్మమే ఆయననుకాపాడిందని అగోరి నాగసాధువు గుర్తు చేశారు.

బ్లాక్ మెయిలింగ్ చేసిన వ్యక్తులను ఎంతటివారినైనా ఉపేక్షించవద్దని అగోరి నాగసాధు సూచించారు అందరినీ అరెస్ట్



చేసి కటకటాల తోరయాలని కఠినంగా శిక్షించాలని అన్నారు వారితోపాటు కన్నయ్య స్వామి భక్తుడు పవన్ కుమార్ ఉన్నారు

# వాటర్ వర్క్స్ అధికారులతో కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల సమావేశం

**సికింద్రాబాద్,ఫిబ్రవరి 13(వార్త వేదిక సూర్య):** సీతాఫాల్మండి డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల నివాసంలోని వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ... రానున్న ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని నీటి కొరత లేకుండా ఉండేలా ముందస్తుగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు అలాగే కలుషిత నీరు వస్తున్నాయని ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా పని చేయాలని సూచించారు నామాలగుండులో తన నివాసం ఉండే అపార్ట్మెంట్ లో కలుషిత నీరు వస్తుందని వాటర్ వర్క్స్ మేనేజర్ కుషాల్ గారితో సమావేశమై వారు కలిసి ఎక్కడి నుండి వస్తుందో అని వాటర్ లైన్ ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు తొందరగా సమస్యను గుర్తించి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు ఈ సందర్భంగా కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ గారు ప్రజలకు



నీటిని వృథా చేయద్దు అని విజ్ఞప్తి చేశారు అలా ఎవరైనా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు అలాగే




సీతఫలమండి డివిజన్ లో ఏదైనా పవర్ బోర్స్ మరియు హ్యాండ్ బోర్స్ రిపేర్ లో ఉంటే మా దృష్టికి తీసుకొస్తే మేము రిపేర్ చెపిస్తా మని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ కుషాల్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేఎంసీలో కార్మికురాలు నర్సమ్మ మృతి

### సంతాపం తెలిపిన జాజాల రుద్రకుమార్ ఇతర కార్మికులు

**గండిపేట్, (వార్త వేదిక సూర్య):** గండిపేట్ మండల పరిధిలోని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ లో మున్సిపల్ కార్మికురాలు నరసమ్మ (65) మృతి బాధకరమని జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్ అన్నారు. ఇటివల ఆమె అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన గండిపేట్ మండల కన్వీనర్ దప్పు ప్రవీణ్ కుమార్ ఆమెకు సిఐటియూ జెండా కప్పి పూలమాల వేసి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ, రూ.10 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. చనిపోయిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులను తీసుకోవాలని, ప్రభుత్వం వారిని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు కలిసి రూ.4 వేలు కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ జిల్లా అధ్యక్షులు యాదగిరి, జవాన్లు జగన్ మోహన్ రావు, రామాంజనేయులు, నవీన్, లక్ష్మీనారాయణ, సుభాష్, సురేష్, శ్రీధర్, ట్రోఫీ, మల్లేష్,






సిహెచ్ వెంకటేష్, కృష్ణ, కార్మికురాలు ప్రభావతి, నరసమ్మ సుజాత, సబిత, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY






## జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాల్లో సత్తా చాటిన నల్లగొండ జిల్లా విద్యార్థి

**నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 13(వార్తా వేదిక సూర్య):** జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాల్లో తిప్పర్తి మండలం రాజుపేట గ్రామానికి చెందిన బైరోజు నేహ లత 93.22 పర్సంటేజ్ సాధించింది.శేరి లింగంపల్లి గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్నది. ఈ సంధర్బంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎస్సీడిడి ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎన్ శ్రీధర్, గురుకుల కార్యదర్శి డాక్టర్ వర్షిని, ప్రిన్సిపల్ కల్పనా అభినందించారు.చదువుకు పేదరికం అడ్డు కాదని వారు కొనియాడారు.



## దేవరకొండలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నిర్మించాలి

**నల్ల శ్రీకాంత్ జాంభవ్ MSF దేవరకొండ ఇంచార్జ్**

**దేవరకొండ ఫిబ్రవరి 13 (వార్త వేదిక సూర్య):** దేవరకొండ నియోజకవర్గం లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను నిర్మించాలని. దేవరకొండ నియోజకవర్గం మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఇన్చార్జ్ నల్ల శ్రీకాంత్ జాంభవ్ డిమాండ్ చేశారు, నియోజకవర్గంలోని 8



మండలాలు ఉన్న అత్యంత జనాభా గలిగిన, ఈ ప్రాంతంలో ప్రభుత్వం మెడికల్ కళాశాల లేకపోవడం అనేది దురదృష్టకరమని, వారు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ కళాశాలలో ఉన్న రెక్క ఆడితే గాని, డొక్కాడని పేద విద్యార్థుల దగ్గర అధిక ఫీజులకు వసూలు చేస్తున్నారని,కట్టలేక పోతున్నారని వాపోతున్నారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దేవరకొండ నియోజకవర్గం లో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎంఎస్ఎఫ్ ప్రక్షాళన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ దేవరకొండ మండల అధ్యక్షుడు రోహిత్, నల్ల శివకుమార్, గణేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు

## సేవలాల్ జయంతి 15న గిరిజనులు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి :ఉదావత్ లచ్చిరాం

**నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 13(వార్తా వేదిక సూర్య):** బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవలాల్ మహారాజ్ జయంతి రోజైనా ఫిబ్రవరి 15 నాడు ప్రతి ఒక్క గిరిజనలు కనీసం ఒక మొక్కను నాటాలని ఎస్సి ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి, ట్రైబల్ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదావత్ లచ్చిరామ్ బుధవారం నల్గొండ లో, రాష్ట్రంలో ఉన్న గిరిజనులకు పిలుపునిచ్చారు. గత సంవత్సరం సంత్ శ్రీ సేవాలాల్ జయంతి సందర్భంగా నల్గొండ లోని బిటిఎస్ లో తన ఇంటి ముందు నాటిన అరటి మొక్క ఎదగడం చూసి ఆనందాన్ని వ్యక్తం చేశారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 13(వార్తా వేదిక సూర్య):** చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన పందుల గోపాల్ కుమారుడి వివాహానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరైయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన తాటిపాముల లింగయ్య కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



అనంతరం చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామానికి చెందిన ఆందె లింగయ్య కుమార్తె వివాహానికి హాజరైయారు..నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం నార్కెట్ పల్లి పట్టణానికి చెందిన జీడిమడ్ల పూలమ్మ కుమారుడి వివాహానికి హాజరైయారు..నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## నల్గొండ గవర్నమెంట్ పాలిటెక్నిక్ జట్టుకు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో కబడ్డీ విభాగంలో ద్వితీయ స్థానం

**నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 13(వార్తా వేదిక సూర్య):** హైదరాబాద్లోని రామంతపూర్ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో గవర్నమెంట్ పాలిటెక్నిక్ నల్గొండ జట్టు కబడ్డీ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ప్రిన్సిపాల్ నరసింహ రావు గెలిచిన జట్టుకు అభినందనలు తెలియజేశారు. ఈ గేమ్స్ మీట్ కి ఇంచార్జిగా సివిల్ హెచ్ ఓ డి సైదులు, హిమానిటీస్ హెడ్ పి విద్యాసాగర్ రావు, పిడి ప్రసాద్, లక్ష్మీ ప్రసన్న, గోపి తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణకు విద్యాశాఖ మంత్రిని నియమించేది ఎప్పుడు?

**విద్యారంగాన్ని గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం**

**మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ మరియు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి**

**విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి**

**SFI జిల్లా ఉపాధ్యక్షుడు రామావత్ లక్ష్మణ్ నాయక్**



**దేవరకొండ ఫిబ్రవరి 13(వార్త వేదిక సూర్య):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు గడుస్తున్నప్పటికీ విద్యారంగానికి కనీసం ఓ ప్రత్యేక శాఖను నియమించకుండా జాప్యం చేస్తూ విద్యారంగాన్ని గాలికి వదిలేసి కేసిఆర్ అడుగుజాడల్లోనే రేవంత్ రెడ్డి ప్రయాణం చేస్తున్నాడని ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్ నాయక్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు

బుధవారం కొండమల్లేపల్లి ఎస్ఎఫ్ఐ 6వ మండల మహాసభ శ్రీ కాంతి జూనియర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి అస్తవ్యస్తంగా మారిపోయింది అని ఎటువంటి పట్టింపులు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నామమాత్రంగా వ్యవహరిస్తూ చేతులు దులుపుకుంటున్నది అని వారు కాంగ్రెస్ ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. ఒకపక్క గురుకుల విద్యాలయాలలో ఫుడ్ పాయిజన్ తో విద్యార్థులు మరణిస్తుంటే మరోపక్క ప్రభుత్వ విద్యాసంస్థలన్నింటిలో అర కొర సౌకర్యాలు, అధ్యాపకుల లేమి, మంచినీరు సమస్య, సరిపోనీ తరగతి గదులు, శిధిలావస్థలో బిల్డింగులు, అద్దె భవనాల్లో విద్యాసంస్థల నిర్వహణ లాంటి లోపాలతో ప్రభుత్వ విద్యా సంస్థలు కొట్టుమిట్టాడుతుంటే ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వ చేయూత ఏమాత్రం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్ విద్యాసంస్థల నిర్వహణకు ఉద్యోగుల జీతపత్యాలకు కూడా సరిపోని స్థితి ఉన్నదని ఈ సందర్భంలో ప్రతి సంవత్సరం విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే కొత్త సీసాలో పాత సార చందంగా విద్యార్థులకు పాత సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్త సమస్యలు తోడై స్వాగతం పలుకుతున్నాయని అన్నారు. అంతేకాకుండా సంవత్సరాల తరబడి స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయకుండా వేల కోట్ల రూపాయలను పెండింగ్ లో ఉంచి విద్యార్థులకు మొండి చేయి చూపిస్తున్నారని తెలిపారు. విద్యారంగంలో కొంతమేరకైనా సమస్యలు పరిష్కరించబడాలి అంటే కొఠారి కమిషన్ సూచించిన మేరకు రాష్ట్ర బడ్జెట్లో 30% నిధులు కేటాయించి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగం పట్ల చిత్తశుద్ధి చాటుకోవాలని వారి డిమాండ్ చేశారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలని,విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ విడుదల చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈనెల 19,20 తేదీలలో నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే జిల్లా మహాసభలో నల్గొండ జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం కోసం నల్గొండ పట్టణ కేంద్రంలో జరిగే 45వ మహాసభలను జయప్రదం చేయాలని అన్నారు.

అనంతరం నూతన ఎస్.ఎఫ్.ఐ మండల కమిటీని అధ్యక్ష కార్యదర్శులు కే. నాతనియల్ నేర్లపల్లి జై చరణ్ తో పాటు 16 మందితో ఏకగ్రీవంగా కమిటీ ని ఎన్నుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ సిద్దు విజయ్ శివసాయి మురళి త్రిష శైలేజా పూజ కొర్ర దేనిష్ శరత్ రాము నందిని తదితరులు పాల్గొన్నారు.

## 18న దళిత బంధు సాధనకై నిరసన ర్యాలీలో పాల్గొనండి

**నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 13(వార్తా వేదిక సూర్య):** రెండో విడత మంజూరైనా దళిత బంధు నిధులను విడుదల చేయాలని కోరుతూ నలగొండ నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ భవనం నుండి క్లాక్ టవరు మీదుగా అంబేద్క విగ్రహ భాస్కర్ టాకీస్ వరకు జరిగే నిరసన ర్యాలీలో లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని దళిత నాయకులు బొర్ర సుధాకర్ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున స్థానిక అంబేద్కర్ భావనంలో జరిగిన పత్రికా వేలేకరుల సమావేశంలో తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వంద్వారా నల్గొండ నియోజకవర్గం లో ప్రొసీడింగ్స్ ఇచ్చి మంజూర అయ్యిన 1050 మంది నిరుపేద దళితుల లబ్ధిదారుల ఖాతాలో మూడు లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల కోడ్ వలన నిలిపి వేశారని తిరిగి కోడ్ ముగిసినందున కేటాయించిన డబ్బులను వెంటనే విడుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కొన్ని నియోజకవర్గల్లో ఇటీవల విడుదల చేశారాని అన్నారు. మాపైన ఎందుకు ఇంత వివక్ష అని ఆవేదన



వ్యక్తం చేశారు. లేనియెడల చాలా పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని, లబ్ధిదారులు కుటుంబాలు ఆమరణ నిరహార దీక్షకు పునుకుంటామని తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీలో ప్రతి ఒక్కరు హాజరై జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో దళిత నాయకులు కందుల లక్షమయ్య, బదుపుల శంకర్ పాల్గొన్నారు.

## ఉద్యోగులు తమ వృత్తితో పాటు ఆటపాటల్లో కూడా చురుకుగా పాల్గొనాలి

**భారత ఆహార సంస్థ నల్గొండ జిల్లా డివిజనల్ మేనేజర్ సువీన్ కుమార్**

**నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 13(వార్తా వేదిక సూర్య):** ఉద్యోగులు తమ వృత్తి తో పాటు ఆట పాటల్లో కూడా చురుకుగా పాల్గొనాలని, తద్వారా వివిధ రంగాల్లో తమ నైపుణ్యాన్ని పెంచుకోవచ్చని భారత ఆహార సంస్థ నల్గొండ జిల్లా డివిజనల్ మేనేజర్ సువీన్ కుమార్ అన్నారు.

సంస్థ 61వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ క్రీడాంశల్లో గెలుపొందిన వారికి సంస్థ ఎ జి యం (క్యూ సి)డా. రాఘవేంద్ర సింగ్ తో కలిసి బహుమతి ప్రదానం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజల ఆహార భద్రతకు భారత ఆహార సంస్థ గత 61 సంవత్సరాలుగా నిరంతరం పాటుపడుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రికెట్, చెస్, క్యారం బోర్డు, టేబుల్ టెన్నిస్, వాలీబాల్ వంటి




ఆటల్లో పాల్గొన్న వారికి, విజేతలకు ఆయన శుభాకాంక్షలు తెలిపి, భవిష్యత్తులో మరింత మెరుగ్గా రాణించేలా ప్రయత్నం చేయాలని అభిలషించారు.కార్యక్రమంలో సంస్థ సీనియర్ అధికారులు కె ఎన్



కె ప్రసాద్, కృష్ణవేణి, సుకుమార్, బిల్లా శ్రీనివాస రావు, నిర్వాహకులు సతీష్ రెడ్డి, సుమిత్,శుభకర్ , కరుణాకర్, సజిత్, గోపీచంద్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## యువత క్రీడల పట్ల సరైన శ్రద్ధ వహించాలి

**మాజీ జెడ్పిటిసి సలహాదారులు పసునూరి యుగంధర్ రెడ్డి**

**దేవరకొండ ఫిబ్రవరి 13(వార్తా వేదిక సూర్య):** కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించినటువంటి కొండమల్లేపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఉమ్మడి నల్గొండ జిల్లాల నుండి దాదాపు 52 టీములు వచ్చి ఈ యొక్క క్రికెట్లో పాల్గొనగా 15 రోజులు హోరాహోరిగా ఇరుజట్లు పోరాడి లాస్ట్ కి గుర్రంపోడు బోయ గూడెం ఫైనల్ కి చేరాయి ఫైనల్లో ఇరుజట్లు ఇరుజట్లు పోరాడి మొదటి బహుమతి బోయగూడం టీం అందుకుంది రెండవ బహుమతి గుర్రంపూడు మూడు నాలుగు ప్లేస్లలో దేవరకొండ మల్లేపల్లి ఏ వన్ బేకరీ అందుకోవడం జరిగింది. ఈ యొక్క టోర్నమెంట్కి కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఉన్న యువత దాతలుగా ముందుకొచ్చి ముఖ్యంగా నరందాస్ పవన్ అభిషేక్ నాయక్ జితేందర్ యాదవ్ లు ఈ యొక్క విజయంలో పాలుపంచుకున్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన కొండమల్లేపల్లి మాజీ జెడ్పిటిసి సలహాదారులు యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ.



కొండమల్లేపల్లి మండల యువతకి నేను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని నాతోనే ఏలాంటి సహాయ సహకారులైన ఈ యొక్క యువతకు సహకరిస్తానని ఆయన అన్నారు.

ఈ యొక్కకార్యక్రమంలో పాల్గొన్నవారు. ప్రథమ బహుమతి దాత. పి ఆర్ జె బ్రదర్స్. అలాగే బిఆర్ఎస్ పార్టీ నాయకులు అభిషేక్ నాయక్. కాంగ్రెస్ పార్టీ నాయకులు జితేందర్ యాదవ్. టోర్నమెంట్ ఆర్గనైజర్స్ సంఘపు మురళి. రాజు ప్రభు చారి. యువ సురేష్ మణికంఠ. రమేష్. తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎస్ క్యూబిక్ మీటర్ కొలతలు రద్దు చేయాలి

**కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎన్ ఎం ఎస్, క్యూబిక్ మీటర్ కొలతలు తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాల పెల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్**

**దేవరకొండ ఫిబ్రవరి 13 (వార్తా వేదిక సూర్య):** కొండ మల్లేపల్లి మండలం పెండ్లిపాకుల గ్రామంలో ఉపాధి కూలీల పని ప్రదేశంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వం నమోదు కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కంబాలపల్లి ఆనందు మాట్లాడుతూ ఎన్ ఎం.ఎం.ఎస్(నేషనల్ మానిటరింగ్ సిస్టం) ద్వారా పని ప్రదేశంలో కూలీల ఫోటోలు స్మార్ట్ ఫోన్స్ ద్వారా మేట్ మస్టర్ అప్లోడ్ చేస్తేనే వేతనాలు బ్యాక్ అకౌంట్లో వస్తాయి ఇది చట్ట వ్యతిరేకమైన చర్యని



వారు అన్నారు గ్రామ ప్రాంతంలో సిగ్నల్ రాక డేటా సరిగా రాక పోవడం వల్ల ఆ రోజు వేతనాలు రాని పరిస్థితి ఉన్నది గ్రామీణ ఉపాధి కూలీలను గిరిజన ఇతర పేదలను పనికి దూరం చేసేదమే అవుతుందని పనిచేయగలిగిన ప్రతి ఒక్కరికి పని చూపాలని చట్టం ఇచ్చిన మౌలిక అంశాన్ని అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం చేస్తుందని ఆరోపించారు పనిచేసే వాచర్లకు 300 రోజుల పని కల్పించాలని రెగ్యులర్గా వాచర్లకు పని కల్పించాలని రోజుకూలి ఉపాధి కూలీలకు 600 రూపాయలు ఇవ్వాలని క్యూబిక్ మీటర్ విధానం ఎన్.ఎం.ఎం.ఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కావలి కృష్ణయ్య కూలీలు సైదమ్మ కదారి నారయ్య కే లక్ష్మమ్మ ఊరే ఈదమ్మ ఇతరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY




# మహిళా న్యాయమూర్తిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం..



**చౌటుప్పల్, ఫిబ్రవరి 13 (వార్తా వేదిక సూర్య):** లాయర్స్ ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రి స్వామిలిఎల్బీనగర్ లోని లాయర్స్ పోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదల చేస్తూ తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లాయర్స్ పోరంపర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ లైబ్రరీ కార్యదర్శి ,హైకోర్టు ప్రముఖ న్యాయవాది నర్రి స్వామి కురుమ మాట్లాడుతూ ...ఎల్బీనగర్ కోర్టులో విధి నిర్వహణలో భాగంగా ఒక కేసులో ముద్దాయికి శిక్ష విధించితే జీవిత ఖైదు పడినటువంటి ముద్దాయి రెండవ కేసులో ట్రాయల్ కి వచ్చిన సమయంలో కోర్టు హాల్లోనే చెప్పు కొట్టాలి అన్న ఉద్దేశంతో చెప్పు విసరడం అనేది చాలా దుర్మార్గమైన చర్య దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం ఇది న్యాయ వ్యవస్థ లోనే చీకటి రోజుగా చెప్పుకోవచ్చు ఈ చర్య జరుగుతున్న ప్రేక్షక పాత్ర పోషించిన పోలీసుల పైన కూడా కఠినమైనటువంటి చర్యలు తీసుకోవాలి ఈ చర్యకు పాల్పడిన ముద్దాయిని వెంటనే ఉరిశిక్ష విధించి అమలు చేయాలి అప్పుడు మాత్రమే న్యాయవ్యవస్థ మీద ప్రజలకు నమ్మకం ఉంటుంది అదేవిధంగా న్యాయవ్యవస్థ , న్యాయవాదుల , న్యాయమూర్తుల మీద సమాజంలో గౌరవము మర్యాదలుంటాయి లేకపోతే ఇలాంటి దాడులు పునావృతమవుతాయి అందుకోసమే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ ఆక్ట్ ఏర్పాటు చేయాలని లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ నుంచి డిమాండ్ చేస్తున్నామన్నారు.




# జై కేసారం గ్రామ శాఖ కన్వీనర్‌గా సమ్మిరెడ్డి జనార్దన్ రెడ్డి

**చౌటుప్పల్, ఫిబ్రవరి 13 (వార్తా వేదిక సూర్య):** చౌటుప్పల్ మండలంలోని జైకేసారం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. అదేవిధంగా గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఉద్దేశ అనుసారం పార్టీ గ్రామ శాఖ కన్వీనర్ గా సమిరెడ్డి జనార్దన్ రెడ్డి నియమించారు. కాంగ్రెస్ పార్టీ నుండి కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక్షస పాలనతో విసిగిపోయి కాంగ్రెస్ నాయకుడు గుత్త బాల్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్ ,సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, BRTU జిల్లా అధ్యక్షులు ఢిల్లీ మాధవరెడ్డి, మండలపార్టీ ఉపాధ్యక్షులు చిన్నం బాలరాజు కురుమ మెట్టు మహేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిఆల్మాస్ పేట కృష్ణ సీనియర్ నాయకులు కోర్పురి లింగయ్య, డైరెక్టర్ దొడ్డి శ్రీశైలం, బోదాసు వెంకటయ్య , నీల శేఖర్ గంగదేవి రమేష్ లింగస్వామి శంకర్ యువజన విభాగం అధ్యక్షులు కట్ట రంగనాథ్, కోర్పూరి గణేష్ దొడ్డి గణేష్ సందీప్ ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.



# చిరు వ్యాపారుల సమస్యలపై ఐఎన్టియుసి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం

**చౌటుప్పల్, ఫిబ్రవరి 13 (వార్తా వేదిక సూర్య):** చౌటుప్పల్ చిరు వ్యాపారుల కార్మిక సంఘం ఐఎన్టీయూసీ చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షులు ముత్యాల గణేష్ కుమార్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారుల సమస్యలపై స్థానిక మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నరసింహారెడ్డి గురువారం వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ రామచందర్, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి సామకూర రాజయ్యలు మాట్లాడుతూ రోడ్డుకి ఇరువైపులా చిరు వ్యాపారులు సుమారు 300 మంది ఉన్నట్లు తెలిపారు వారి జీవనోపాధికి దాదాపు 35



సంవత్సరాల నుండి అన్ని రకాల చిరు వ్యాపారస్తుల కుటుంబాలు దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నట్లు తెలిపారు చౌటుప్పల్ పట్టణంలో ఉన్న చిరు వ్యాపారస్తులకు గడువును పెంచాలని మున్సిపల్ కమిషనర్ ని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ అధ్యక్షులు మొహమ్మద్ ఆరిఫ్, చిరు వ్యాపారుల సంగం మహిళా సభ్యులు భారతమ్మ, సుగుణమ్మ, శంకరమ్మ, అండాలు, బాలమని,రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటా భగవాన్ నామ సంకీర్తనలు

**చౌటుప్పల్, ఫిబ్రవరి 13 (వార్తా వేదిక సూర్య):** శ్రీ భావన ఋషి కళానికేతన్ ఆధ్వర్యంలో గత 90 మాసాలుగా ప్రతినెల పౌర్ణమి ఎంపిక చేసుకుని ఇంటింటా భగవన్నామ సంకీర్తన సుధా ప్రవంతి కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తు న్నారు. మాఘ పౌర్ణమి పురస్కరించుకొని సుంకెనపల్లి గ్రామంలో శ్రీ విశ్వకర్మ మనుమయ సంఘం చౌటుప్పల్అధ్యక్షులు, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులుపంతంగి మదనాచారి గృహంలో భక్తి కీర్తన గానసీరాజనాలు నిర్వహించారు.

శ్రీభావన ఋషి ఈ సందర్భంగా భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ధర్మ నిరతిని సనాతన ధర్మాన్ని ప్రచారం చేశారు కళానికేతన్ వారి ఆధ్వర్యంలో జరిగింది. ఇంటింటా భగవాన్ నామ సంకీర్తన సుధా ప్రవంతి పురస్కరించుకుని గృహం లో నిర్వహించడం వలన మానసిక వికాస కారకుడు భగవానుడు చంద్రుడు పౌర్ణమి రోజున అనంత ఆకాశం నుండి భూమికి తన వెన్నెల ద్వారా ఆశీ రామృతం ప్రసరించునని శ్రీ భావన ఋషి కళానికేతనుసభ్యులు తెలియచేశారు.

ఈ కార్యక్రమంలో బడుగు శ్రీరాములు, పోలోజు రాజు,బడుగు బాలరాజు,బడుగు సావిత్రి,కోనం వినోద,ముషం ప్రమీల,పోలోజు వెంకటాచారి, గంజి మార్కండేయులు, గట్టు రవి,పోలోజు కృష్ణాచారి, మార సంగమేశ్వర్,దార హరికుమార్, తిరుమలేష్, సింహాచలం జ్యోతిష్య శిరోమణి కూరెళ్ళ నరసింహా చారి తదితరులు పాల్గొన్నారు










# ప్రతి ఒక్కరికి కంటిచూపు బాగుండాలని నిరంతర ప్రక్రియగా వైద్య శిబిరాలు

- ఇప్పటికే 1371 మందికి వైద్య పరీక్షలు, 324 మందికి కంటి ఆపరేషన్‌లు
- స్వయంగా అసువత్రికి వెళ్లి బాగోగులు చూసుకుంటున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి
- సామాజిక సేవలో వున్న సంతృప్తి దేంట్లోను లేదు
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**చౌటుప్పల్, ఫిబ్రవరి 13 (వార్తా వేదిక సూర్య):** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తమ తల్లి పేరుతో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజక వర్గంలోని ప్రతి తల్లికి తండ్రికి కన్నకొడుకులాగా మారి కంటి ఆపరేషన్లు చేయిస్తున్నారు. నియోజకవర్గంలో కంటిచూపుతో బాధపడుతూ ఏ ఒక్కరు ఇబ్బంది పడొద్దంటూ ఉచిత కంటి వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టారు. ఈ వైద్య శిబిరాలు నిరంతర ప్రక్రియ లాగా కొనసాగిస్తున్నారు. జనవరి 19 న మొదటి విడత వైద్య శిబిరానికి అనూహ్యమైన స్పందన వచ్చింది.

1058కి వైద్య పరీక్షలు నిర్వహించగా 216 మందికి ఆపరేషన్లు పూర్తి చేశారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆపరేషన్లు చేయించి అలాగే వదిలేయకుండా ఆస్పత్రికి వెళ్లి మరలా వారికి వైద్య పరీక్షలు చేయించి కంటి పనితీరును పరిశీలించారు. ఈనెల 9న మరొక 313 మంది కి వైద్య పరీక్షలు నిర్వహించి 108 మందికి కంటి పరీక్షలు చేయించారు. బిజీ షెడ్యూల్ లో కూడా హైదరాబాదు లోని శంకర కంటి ఆసుపత్రిలో ఆపరేషన్ చేసిన ప్రతి ఒక్కరిని ఎమ్మెల్యే పేరుపేరునా ఆత్మీయంగా పలకరించి మీకు నేనున్నాను అనే భరోసా కల్పిస్తూ అందరి అభిమానాన్ని పొందుతున్నారు.



# జాబ్ మేళాతో... యువతకు చేయూత

## ప్రైవేట్ జూనియర్ కళాశాలల అధికార ప్రతినిధి మల్లేశం

**చౌటుప్పల్, ఫిబ్రవరి 13 (వార్తా వేదిక సూర్య):** జాబ్ మేళా ద్వారానే యువతకు చేయూత లభిస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ జూనియర్ కళాశాలల అధికార ప్రతినిధి సింగనబోయిన మల్లేశం అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ పట్టణంలోని గాంధీ పార్క్ వద్ద ఉన్న ప్రతిభ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో గురువారం మెగా జాబ్ మేళాను నిర్వహించారు. ఈ జాబ్ మేళాను మల్లేశం ప్రారంభించి మాట్లా డుతూ ఉద్యోగాల్లో విజయం సాధించాలంటే నైపుణ్యాన్ని పెంచుకోవాలని యువతకు సూచించారు. అప్పటి కాలంలో ఉద్యోగం కోసం యువత కంపెనీల చుట్టూ తిరిగేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఈ జాబ్ మేళాలో సుమారు 10 కంపెనీలు పాల్గొనగా 90 మంది విద్యార్థులు జాబ్ మేళాను వినియోగించు కున్నారు. అందులో 15 మంది ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా జాబ్ మేళాను ఏర్పాటు చేసిన కళాశాల యాజమాన్యాన్ని, కంపెనీ ప్రతినిధులు జోసెఫ్ రెడ్డి, నవీన్ రెడ్డి, సందీప్ కుమార్ లను మల్లేశం అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రధాన కార్యదర్శి బత్తుల శంకర్, ఉమ్మడి నల్గొండ జిల్లా జెయింట్ సెక్రెటరీ మధిర మల్లేశం, జిల్లా సభ్యులు వెంకట్ రాజు, కళాశాల కరస్పాండెంట్ సిలివేరు ధనలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ సిలివేరు శ్రీనివాస్, అధ్యాపక బృందం బి పూజ, డి పూజ ,బి శ్వేత ,ఎం సంధ్య తదితరులు పాల్గొన్నారు.




# అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలి

## - ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి



**నల్లగొండ బ్యూరో,ఫిబ్రవరి 13 (వార్తా వేదిక సూర్య):** వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్,వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి చెప్పారు.నామినేషన్ ల ఉపసంహరణ అనంతరం గురువారం ఆమె ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు,వారి ఏజెంట్లతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు.ఎన్నికలలో పోటీలో ఉన్న అభ్యర్థులు పాఠశాల సమయాలలో ప్రచారం చేయడం నిషిద్ధమని,అనుమతుల కోసం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గం పరిధిలో ఉండే ఆయా జిల్లా ఎన్నికల అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో అనుమతులు తీసుకోవచ్చని తెలిపారు.మొత్తం నియోజకవర్గానికి సంబంధించిన అనుమతులను నల్గొండ ఆర్ ఓ ద్వారా తీసుకోవచ్చని చెప్పారు. ముఖ్యంగా వాహనాలు,ర్యాలీలకు సంబంధించిన అనుమతులు ఆయా జిల్లాలలో తీసుకోవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పోలింగ్ ఏజెంట్ల నియామకం,కౌంటింగ్ ఏజెంట్ల వివరాలు వెంటనే సమర్పించాలని, గుర్తింపు కార్డులకు ఫోటోలను వెంటనే ఇవ్వాలని అన్నారు.ఈ నెల 10న ప్రచురించిన ఓటరూ జాబితా ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల వివరాలను ఆమె అభ్యర్థులకు తెలియజేస్తూ 25797 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. నల్గొండ సమీపంలోని ఆర్జాల భావి వద్ద ఉన్న గోదాంలో స్ట్రాంగ్ రూమ్ తో పాటు,ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని అక్కడే ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గట్టి బందోబస్తును ఏర్పాటు చేయడం జరుగుతుందని,అభ్యర్థులు ర్యాలీలు, సమావేశాలకు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని,అలాగే కాన్వాసింగ్ వెహికల్స్ కు సైతం ముందే అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల ఏజెంట్లను నియామకంలో ఎలాంటి నేరచరిత లేని వారిని ఎంపిక చేయాలని అన్నారు. అభ్యర్థుల వద్ద ఎలాంటి లైసెన్స్ ఆయుధాలు ఉన్న ముందే డిపాజిట్ చేయాలని,ఎన్నికల నిబంధనల ప్రకారం ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు లౌడ్ స్పీకర్ల కు అనుమతి ఉంటుందని,కౌంటింగ్ సందర్భంగా మూడంచల భద్రత ఉంటుందని, సీసీటీవీ కెమెరాల నిఘాలో భద్రతను పర్యవేక్షిం చడం జరుగుతుందని తెలిపారు.అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ప్రజాప్రతినిధ్య చట్టం127 ప్రకారం ప్రచురించే కరపత్రాలు,వాటి నియమ నిబంధనలు,అలాగే మీడియా సర్టిఫికేషన్ కమిటీ ద్వారా తీసుకునే అనుమతులపై వివరించారు.ప్రతి అభ్యర్థి ఎన్నికల నియమాలని తూ.చా తప్పకుండా పాటించాలని,లేనట్లయితే ఎన్నికల నియమావళిని ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఓట్ల లెక్కింపు సందర్భంగా 25 టేబుళ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రతి అభ్యర్థి ఒక ఏజెంట్ ను ఒక టేబుల్ కు నియమించుకోవచ్చని ఆయన సూచించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు,వారి ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

**ఉపసంహరణ...** వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణలో భాగంగా గురువారం ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో19 మంది అభ్యర్థులు నిలిచారు. కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, గంగిరెడ్డి కోటి రెడ్డి, బండ నాగరాజు లు ఉపసంహరించుకున్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నల్గొండ, ఫిబ్రవరి 13 (వార్తా వేదిక సూర్య):** దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ఓపి, ఇన్ పేషెంట్లు, వివిధ వార్డులను ఆమె తిరిగి పరిశీలించారు. ఆస్పత్రి వైద్యాధికారితో ఆస్పత్రి ద్వారా అందిస్తున్న సేవలు,గురువారం నాటి పేషెంట్లు వివరాలు, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద



వైద్యులకు సరైన వైద్యం అందించాలని, ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, తదితరులు ఉన్నారు.



## ప్రభాస్, హను రాఘవపూడి ప్రాజెక్ట్‌లో అనుపమ్ ఖేర్

మ్యాసీవ్ బ్లాక్‌బస్టర్స్ సలార్, కల్కి 2898 ఎడి తర్వాత రెబెల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం క్రియేటివ్ డైరెక్టర్ హను రాఘవపూడితో ఓ ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ కోసం కొలాబరేట్ అయ్యారు. ప్రముఖ పాన్-ఇండియా స్టూడియో మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం లార్జర్ దెన్ లైఫ్ ఎలిమెంట్స్ తో విజువల్ వండర్ గా ఉండబోతోంది. లేటెస్ట్ అప్‌డేట్ ఏమిటంటే, ఈ చిత్రంలో బాలీవుడ్ లెజెండ్ అనుపమ్ ఖేర్ చాలా ముఖ్యమైన పాత్ర కోసం ఎంపికయ్యారు. ఈ వార్తను ఆయన స్వయంగా షేర్ చేశారు.

గొప్ప పాత్రలు చేయడంలో పేరుపొందిన అనుపమ్, ఈ సినిమా స్క్రిప్ట్‌ను "అద్భుతం" అని అన్నారు. ప్రభాస్‌తో స్క్రీన్ స్పేస్‌ను పంచుకోవడానికి ఉత్సాహంగా వున్నారు. దర్శకుడు హను రాఘవపూడి ప్రతిభను కూడా ఆయన ప్రశంసించారు.


## సుమంత్ ప్రభాస్, జగపతి బాబు, సెకండ్ షెడ్యూల్ పూర్తి

తన తొలి మూవీ 'మేం ఫేమస్'తో లీడ్ యాక్టర్, దర్శకుడిగానూ మంచి గుర్తింపు తెచ్చుకున్న సుమంత్ ప్రభాస్ హీరోగా తన రెండో మూవీతో రాబోతున్నారు. ఈ కొత్త మూవీ రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ మేడిన్ వెంచర్. MR ప్రొడక్షన్స్ షార్ట్ ఫిల్మ్‌లతో పాపులరైనా సుభాష్ చంద్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రం సెకండ్ షెడ్యూల్ షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ షెడ్యూల్‌లో హై-ఎనర్జీ సన్నివేశాలు చిత్రీకరించారు. వీటిలో ఫస్ట్ అఫ్ ఇట్స్ కింద్ ఆటో రేస్ సీక్వెన్స్, ఇంటెన్స్ యాక్షన్ బ్లాక్‌లు ఉన్నాయి, ఇవి థ్రిల్లింగ్ సినిమాటిక్ అనుభవాన్ని ఇస్తాయి.

అలాగే సుమంత్ ప్రభాస్, రాజ్‌కుమార్ కసిరెడ్డి, సుదర్శన్, వివా రాఘవ్, రోహిత్ కృష్ణ వర్మలతో కూడిన కామెడీ ట్రాక్‌లను చిత్రీకరించారు. రేలంగి, భీమవరం, సకినేటిపల్లి లంక, అంతర్వేది ఆలయ ప్రాంగణంతో సహా అందమైన లోకేషన్స్ లోషూటింగ్ జరిగింది. ఈ షెడ్యూల్‌లో అనేక కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించారు. సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్, జగపతి బాబు, లైలా, రాజీవ్ కనకాల, హర్షవర్ధన్ షూటింగ్ లో పాల్గొన్నారు. ఇప్పుడు టీం మూడవ షెడ్యూల్‌కు



సిద్ధమవుతోంది, ఫిబ్రవరి చివరి వారంలో ప్రారంభమై మార్చి మిడ్ టైం వరకు కొనసాగనుంది. ఇందులో పాటలు, ఇతర కీలకమైన సన్నివేశాల చిత్రీకరించనున్నారు.



## ఏమి మాట్లాడినా
## చైతూ గురించేనా?

సమంత రూత్ ప్రభు ఇప్పుడు తన కెరీర్‌పై మరింత ఫోకస్ పెట్టింది. విడాకుల అనంతరం ఆమె జీవితంలో చాలా మార్పులు వచ్చాయి. సినిమాల్లో కొత్త ఛాలెంజ్‌లు తీసుకోవడం, ఆరోగ్యంపై దృష్టి పెట్టడం, అంతర్జాతీయ స్థాయిలో ప్రాజెక్టులు ఎంపిక చేసుకోవడం వంటి వాటితో ముందుకు సాగుతోంది. అయితే, ఆమె సోషల్ మీడియాలో ఏదైనా పోస్ట్ చేస్తే అది గట్టిగానే ట్రెండ్ అవుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆమె చేసిన ఓ పోస్ట్ మళ్లీ చర్చనీయాంశమైంది. "మనుషులు ఒక స్థితిలో ఉండిపోరు.. వారు మారిపోతూనే ఉంటారు" అనే సందేశాన్ని షేర్ చేసింది. దీంతో సోషల్ మీడియాలో దీన్ని నాగచైతన్య - శోభిత విషయానికి లింక్ చేసేస్తున్నారు. సామ్ నెగిటివ్ గా చేయకపోయినా అలాగే పాజిటివ్ గా స్పందించినా కూడా వారి గురించే అన్నట్లు హైలెట్ చేస్తున్నారు. అయితే అభిమానుల అభిప్రాయాలను బట్టి చూస్తే, ఇది పూర్తిగా తప్పు. సమంత తన జీవితాన్ని, తన కెరీర్‌ను గాడిలో పెట్టుకునే పనిలో ఉంది. ఆమె ప్రస్తుతం తన ఆలోచనలను, జీవితం గురించి తనకు వచ్చిన అనుభవాలను పంచుకుంటోంది. ఆమె చెప్పే ప్రతి పదాన్ని చైతన్య సంబంధిత వ్యవహారాలతో ముడిపెట్టడం అన్యాయం. విడాకుల అనంతరం సమంత వ్యక్తిగత జీవితాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రపంచమంతటా అనుభవాలను పెంచుకుంటూ, కొత్త అవకాశాలను ఒడిసిపట్టుకుంటూ తనకు నచ్చిన జీవితాన్ని గడుపుతోంది.. అని అభిమానులు దీనికి తగిన విధంగా కౌంటర్ ఇస్తున్నారు. సమంత నెవ్వర్ బిఫోర్ అనేలా ప్రస్తుతం కొత్త ప్రాజెక్టులు చేస్తోంది, ముంబై, లాస్ ఏంజెలెస్ లాంటి చోట్ల ప్రముఖులతో మీటింగ్స్ జరుపుతోంది. ఈ క్రమంలో ఎన్నో అనుభవాలు ఎదురవుతున్నాయి. వాటిలో మంచి చెడులో కొన్ని భావాలను సోషల్ మీడియాలో షేర్ చేయడం సహజమే. ఈ విషయం అభిమానులకైతే బాగా అర్థమైంది. కానీ కొంతమంది మాత్రం ఏం జరిగినా సమంతను చైతన్య జీవితం వైపు లాగిపోవడం కేవలం ట్రోలింగ్ కోసమేనని ఫ్యాన్స్ అంటున్నారు. విడాకుల తర్వాత కూడా సమంత ఎప్పుడూ చైతన్య గురించి నెగటివ్‌గా మాట్లాడలేదు. ఆమె చేసిన ప్రతి చిన్న కామెంట్‌ను చైతూ, శోభితల వ్యవహారానికి అన్వయించడాన్ని అభిమానులు తప్పుబడుతున్నారు. ఇక సమంత రేంజ్ పెరుగుతూనే ఉంది. ఆమె ప్రస్తుతం బాలీవుడ్‌లో అవకాశాలు చూస్తోంది. ఓటీటీలో ఇప్పటికే సిటాడెల్ ప్రాజెక్ట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రీచ్ పొందుతోంది. అలాగే నెక్స్ట్ ప్రాజెక్ట్ గురించి ఆమె సీరియస్‌గా ప్లానింగ్ చేస్తోంది. ఏదేమైనా ఆమె ఏదైనా పోస్ట్ చేస్తే అది ఆమె వ్యక్తిగత ఆలోచనలతో సంబంధముంటుంది, లేదా ఉండకపోవచ్చు.

## బుక్ మై షోలో తల మూవీ టికెట్‌ను కొన్న నాగార్జున

దీపా ఆర్ట్స్ బ్యానర్‌పై శ్రీనివాస్ గౌడ్ నిర్మాతగా అమ్మ రాజశేఖర్ దర్శకత్వం వహించిన సినిమా 'తల'. ఈ చిత్రంతో అమ్మ రాజశేఖర్ తనయుడు అమ్మ రాగిన్ రాజ్ ఈ హీరోగా పరిచయం అవుతున్నాడు. అంకిత నస్కర్ హీరోయిన్. రోహిత్, ఎస్తేర్ నోరన్హ,ముక్కు అవినాష్, సత్యం రాజేష్, అజయ్, విజ్జి చంద్రశేఖర్, రాజీవ్ కనకాల, ఇంద్రజ ఇతర కీలక పాత్రల్లో నటించారు. శ్యామ్ కే నాయుడు సినిమాటోగ్రఫీ అందించిన ఈ చిత్రానికి ధర్మతేజ సంగీత దర్శకుడు. తల సినిమా ఈ 14న విడుదల కాబోతోంది. ఇప్పటికే తలపై భారీ అంచనాలున్నాయి. ప్రమోషనల్ కంటెంట్ చూసిన వాళ్లంతా ప్రామిసింగ్‌గా ఉందని మెచ్చుకుంటున్నారు.



ఇక తాజాగా కింగ్ నాగార్జున బుక్ మై షోలో ఈ మూవీ ఫస్ట్ టికెట్ ను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఈ చిత్ర ట్రైలర్ ను చూసి చాలా మెచ్చుకున్నారు. రాగిన్ రాజ్ పెద్ద హీరో అవుతాడని ఆశీర్వదించారు. అమ్మ రాజశేఖర్ డైరెక్షన్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉందని కితాబునిచ్చారు. అమ్మ రాజశేఖర్ తో తన మొదటి పరిచయాన్ని గుర్తు చేసుకుని ఈ సినిమా తప్పకుండా మంచి విజయం సాధించాలని ఆకాక్షిస్తూ.. నిర్మాత శ్రీనివాస్ గౌడ్ కు ఆల్ ద బెస్ట్ చెప్పారు. బుక్ మై షోలో నాగార్జున తల మూవీ ఫస్ట్ టికెట్ ను కొనడం ఈ సినిమా సాధించబోతోన్న పెద్ద విజయానికి చిహ్నం అని దర్శకుడు అమ్మ రాజశేఖర్ ఈ సందర్భంగా ఆనందాన్ని వ్యక్తం చేశారు.



## బాపు అరుదైన సినిమా..
## ఎక్సయిటెడ్‌గా ఎదురు చూస్తున్నాను- రానా దగ్గుబాటి

వెర్సటైల్ యాక్టర్ బ్రహ్మాజీ లీడ్ రోల్‌లో ఒకరిగా ఆమని, బలగం సుధాకర్ రెడ్డి, ధన్య బాలకృష్ణ, మణి ఏగుర్ల, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్న డార్క్ కామెడీ-డ్రామా 'బాపు'. ఈ చిత్రానికి దయా దర్శకత్వం వహిస్తున్నారు. కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అధీరా ప్రొడక్షన్స్ బ్యానర్స్ పై రాజు, సిహెచ్ భాను ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా ఫెబ్రవరి 21న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. హీరో రానా దగ్గుబాటి, తిరువీర్ ఈ ఈవెంట్ కు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో రానా దగ్గుబాటి మాట్లాడుతూ..రెగ్యులర్ కి భిన్నంగా వుండే ఇలాంటి జోనర్స్ రావడం చాలా అరుదు. ఒక కల్చర్ ని చూపించే జానర్స్ రావడం ఆడియన్ గా చాలా ఎక్సయిటెడ్ గా వున్నాను. టీం అందరికీ అల్ ది వెరీ బెస్ట్'అన్నారు. హీరో తిరువీర్ మాట్లాడుతూ.. బాపు టైటిల్ పెట్టగానే నచ్చేసింది. ఇందులో ప్రమోషనల్ కంటెంట్ నా బాల్యానికి తీసుకెళ్ళింది. ట్రైలర్ లో మట్టివాసన కనిపించింది. బ్రహ్మాజీ గారిని ఇలాంటి పాత్రల్లో చూస్తే కడుపునిండిపోయింది. దయ గారు చాలా మంచి సినిమా తీశారు. అందరూ ఆదరిస్తారని కోరుకుంటు న్నాను'అన్నారు .

## అఖీరానందన్ హై ఓల్టేజ్ టీజర్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ వారసుడు అకిరా నందన్ కోసం ఫ్యాన్స్ ఏ స్థాయిలో ఎదురుచూస్తున్నారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పటివరకు సినిమా ఇండస్ట్రీలో ఎందరో వారసులు గ్రాండ్ ఎంట్రీ ఇచ్చారు. కానీ జూనియర్ పవర్ స్టార్ ఎంట్రీ మాత్రం మామూలుగా ఉండదని తెలుస్తోంది. 20 ఏళ్ల వయసులోనే అతని కటౌట్ బాక్సాఫీస్‌కి హెచ్చరికగా కనిపిస్తోంది. వెండితెరపై కనిపిస్తే మామూలు హైట్స్ లోకి వెళ్లదని స్పష్టమవుతోంది. బయట ఎక్కడ కనిపించినా ఫ్యాన్స్ అతన్ని చూడటానికి ఎగబడుతున్నారు. రీసెంట్ గా తండ్రితో కలిసి దేవాలయాల సందర్శన యాత్రలో పాల్గొన్న అఖిరా నిండైన గెడ్డంతో పవర్‌ఫుల్ గా దర్శనమిచ్చాడు. ఇక సోషల్ మీడియాలో అతని ఫోటోలకు వచ్చే రెస్పాన్స్ అసాధారణం. ఇక తండ్రి పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రి గా రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా, జనసేన నేతగా దేశవ్యాప్తంగా మంచి క్రేజ్ అందుకుంటున్నారు. అలాంటి పవర్‌ఫుల్ లీడర్ నుంచి వచ్చే వారసుడు కావడంతో పాన్ ఇండియా రేంజ్‌లో కూడా అతని పై ఫోకస్ ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. పవర్ స్టార్ ఫ్యాన్స్ అకిరా నందన్‌కు ఇస్తున్న ఎలివేషన్స్ కూడా మామూలుగా లేవు. సోషల్ మీడియాలో అతని వీడియోలు, ఫోటోలు సినిమాల టీజర్స్‌కి మించి పవర్‌ఫుల్‌గా తయారవుతున్నాయి. ఇటీవల, ఒక ఫ్యాన్ ప్రభాస్ "మిర్చి" సినిమాలోని డైలాగ్‌తో అకిరా విజువల్స్‌ను హైలైట్ చేస్తూ ఎడిట్ చేసిన వీడియో వైరల్ అవుతోంది. హీరోను ఎలివేట్ చేస్తూ చెప్పే ప్రతీ డైలాగ్ కూడా అకిరాకు పర్ఫెక్ట్‌గా సెట్ అయింది. అకిరా నందన్‌ను మొదట ఎవరు డైరెక్ట్ చేస్తారో తెలియదు కానీ, ఆ డైరెక్టర్ కు అకిరా ఎంట్రీ మూవీనే కెరీర్‌లో బెస్ట్‌గా నిలిచే అవకాశం ఉందని ఫ్యాన్స్ భావిస్తున్నారు.



అకిరా నందన్ హీరోగా ఎంట్రీ ఇస్తాడా లేదా అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. గతంలో అతను విదేశాల్లో నటనలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. మార్షల్ ఆర్ట్స్, డాన్స్‌లో ప్రత్యేక శిక్షణతో పాటు, మ్యూజిక్ పైన కూడా మంచి అవగాహన కలిగి ఉన్నాడు.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS,** H.No.1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI. Title-Code:- TELTEL12333,** Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya.yadadri@gmail.com**